# పదునారవ ప్రసంగము

తరువాతిరోజు ఉదయమున,అందరు వచ్చినతరువాత త్ర్యంబక భాయి జయంతీభాయితో నిట్లనెను. "నిన్నటిప్రసంగము అసంపూర్ణముగ నుండిపోయెను. అందు మిగిలిన విషయములను అడిగినచో మీ సందేహములు నివృత్తిని చెందును."

జయంతీ:— నిన్న జరిగిన ప్రసంగపు చివరిభాగము నాకు జ్ఞాపకము లేదు.

## జ్ఞాపకము ఉంచుకొనని శిష్యులు.

స్వా. ప్ర.:— (వినోదార్థము) ఒకప్పుడు ఒక గురువు శిష్యునకు బ్రహ్మవిద్య నుపదేశించుచుండెను. ఆ సమయమున ప్రక్కనఉన్న ఒక బిలమునుండి రెండు ఎలుకలు వచ్చుచు పోవుచుండెను. శిష్యుడు అదియే చూచుచుండెను. గురువు ఉపదేశము పూర్తి అయిన పిమ్మట శిష్యుని అడిగెను. ఏమి పూర్తిగా లోపలికి వెళ్ళినదా?

శిష్యుడు:— ఆ, లోపలికి పోయినవి. కాని కొంచెము తోక మాత్రము ఇంకను బయట ఉన్నది.

ఇది విని అందరును పకపక నవ్వసాగిరి.

## ద్రవ్యనారాయణుని ఉపాసన.

అదేవిధముగ మీమనోవృత్తి ధర్మచర్చయందు లేదు. ద్రవ్య చర్చయందు ఉన్నది. ద్రవ్యమును సంపాదించుటయే మీధర్మము.

*టకా ధర్మష్టకా కర్మ, టకా హి పరమం పదమ్ ।*
*టకా యస్య గృహే నాస్తి, హాటకా టక్ టకాయతే ॥*

"ధనమే ధర్మము. ధనమే కర్మ. ధనమే సర్వశ్రేష్ఠపదము. ధనము లేని ఇంటిలో కుండ టకటకలాడును."

ధనవంతులను చూచిన, వారివలె ధనము ఉన్నచో సుఖము అనుభవింపవచ్చును అని తోచును. ఇట్లు మీధర్మము, కర్మలు అన్నియు ధనముపై ఆధారపడియున్నవి. ఉదయమునుండి సాయంకాలమువరకు ఒకే ప్రభువును (ద్రవ్యనారాయణుని) భజించుటయందు మీరు నిమగ్నులయి ఉన్నారు. శ్రీమన్నారాయణుడు 16 కళలు కలవాడు. అయినను ఆయన పరోక్షసత్తాత్మకుడు. కాని ఈప్రత్యక్ష నారాయణుడు మాత్రము 16 అణాలు అనే ప్రత్యక్షకళలు కలవాడు. ఒకానొక కవి ఇట్లు వర్ణించెను.

అనా అంశకలా ప్రోక్తా రూప్యోఽసౌ భగవాన్స్వయమ్ ।
అత స్తం సర్వ ఇచ్ఛన్తి రూప్యం హి గుణవత్తమమ్ ॥

"రూపాయి అను భగవానుని 16 కళలు పదహారు అణాలు. రూపాయి సాక్షాత్తు శ్రీమన్నారాయణస్వరూపము. రూపాయి సకలఉత్తమగుణములును కలిగిన సగుణబ్రహ్మము. కావున ఆభగవానుని అందరును కోరుదురు."

జనులు ఈద్రవ్యనారాయణుని ఉపాసించుటకు అలవాటు పడినప్పటినుండియు నిజమగు నారాయణుడు దూరమయి పోయెను. అతని విలువ తెలుసుకొనుటకు ఎవరును ప్రయత్నించుట లేదు.

## నారాయణోపాసన కాదు. లక్ష్మీ ఉపాసన.

ఒకసారి సంభాషణప్రసంగమున లక్ష్మి శ్రీమన్నారాయణునితో నిట్లనెను. "జగమంతయు నన్నే భజించుచున్నది. ఎవరును మిమ్ము తలచుట లేదు." నారాయణుడు అట్లు కాదనెను. లక్ష్మి "అయిన బయలు దేరుడు. పరీక్షించి నిశ్చయించుడు." అనెను.

అనంతరము నారాయణుడు మహావిద్వాంసుడును, మహాతేజోవంతుడును అగు సన్యాసిరూపమును ధరించి ఒకగ్రామమునకు వెళ్ళెను. అతని హస్తమున కమండలాదులుచూచి జనులందరు అతని

వెంటబడిరి. అలౌకికమహాపురుషుడు అని ఆయన ప్రతిష్ఠ నలుదెసల వ్యాపించెను. ఆయన అక్కడనే ఉన్న బ్రాహ్మణఅగ్రహారమునకు వేం చేసెను. లక్ష్మి యోగినీ రూపమును ధరించి, శ్వేతవస్త్రములు, కంఠ మున తులసిమాల మొదలగునవి ధరించి ఆగ్రామముననే ధర్మశాలకు విచ్చేసెను. ఆమె ప్రభావమును గాంచి అనేకమంది ఆమెను భిక్షకు వేంచేయుమని ప్రార్థించిరి. ఆమె భిక్షకు వెళ్లిన ప్రతిఇంటను, మీా సం సారుల ఇండ్లయందు నేను భుజించను, అని చెప్పి తన సంచినుండి పది, పదిహేను వేలు విలువకల కంచము, గిన్నెలు, చెంబు మొద లగునవి తీసికొని వానిలో భుజించి ఎక్కడి వస్తువులు అక్కడనే విడచివచ్చెడిది. ఇక చెప్పవలసినది ఏమికలదు? ఆమెయందలి ఆకర్ష ణచే నారాయణుని దర్శనార్థము వెళ్ళు జనులసంఖ్య తగ్గసాగెను. అనంతరము ఆమెను నారాయణుడు ఉన్నచోటికి భిక్షకు రమ్మని ఆహ్వానించిరి. ఆమె వారికి ఇట్లుచెప్పెను. "నేను మీాఅగ్రహారమునకు భిక్షకు రాను. ఊరియందు ఉన్నసన్యాసిని వెడలగొట్టినచో వచ్చె దను." అది విని బ్రాహ్మణులు ఇట్లనిరి. "ఆయన మహావిద్వాంసుడు ఆయనను ఎట్లు బయటకు వెళ్ళగొట్టగలము?"

లక్ష్మి:— "వారు ఎట్టివారైనను కానిండు. వారు కాలుపెట్టిన చోట నాకాలు పెట్టను." బ్రాహ్మణులు అది విని చెప్పిరి. "సరే మీారు చెప్పినట్లు చేయుదుము. మీారు దయచెయ్యండి." యోగిని బ్రాహ్మణులతో వెళ్లెను. బ్రాహ్మణులు సన్యాసిరూపమున ఉన్న నారాయణుని ఆ స్థానము విడచి వెళ్ళమని చెప్పిరి. నారాయణుడు వారితో ఇట్లనెను. "మొదట మీారు నేను జీవించిఉన్నంతకాలము ఉండవలెనని చెప్పిరి కదా! ఇప్పుడు వెళ్ళమనుచున్నారేమి? నేను వెళ్ళను." చివరకు ఆ బ్రాహ్మణులు బలవంతముగా సన్యాసిని వెడల గొట్టిరి. నారాయణుడు వెళ్ళిన ప్రతిగ్రామమునకును లక్ష్మి వెళ్ళి

ఆగ్రామమునుండి ఆయనను వెళ్ళగొట్టించెను. అనంతరము యోగిని నారాయణుని అడిగెను. "ఏమండీ! జగమున ఎవరు గొప్పవారు అనుకొనుచున్నారు!" నారాయణుడు నవ్వెను.

ఇది విని అందరును నవ్విరి.

అంతట త్ర్యంబకభాయి చెప్పెను. నిన్న చివరిభాగమున ప్రసంగము "సాత్త్వికత్వము" నకు సంబంధించి జరిగెను.

శ్రీప్రకాశానందస్వామివారు శ్రీనిత్యానందస్వామివారిని ఈ విషయమున ఏమైన చెప్పుమని కోరిరి. కానివారు శ్రీప్రకాశానందుల వారిపైననే ఆధారము మోపిరి.

## సత్త్వగుణలక్షణము

స్వా. ప్ర. :—సత్త్వగుణలక్షణమును మనువు ఇట్లుచెప్పెను.

*వేదాభ్యాసస్తపో జ్ఞానం శౌచమిన్ద్రియనిగ్రహః ।*
*ధర్మక్రియాత్మచిన్తా చ సాత్త్వికంగుణలక్షణమ్ ॥*

"వేదాభ్యాసము, తపము, జ్ఞానము. శౌచము, ఇంద్రియనిగ్రహము, ధర్మనిర్వాహణము, ఆత్మచింత ఈ ఏడును సత్వగుణ లక్షణములు."

## వేదాభ్యాసః

25 సంవత్సరముల పర్యంతము బ్రహ్మచర్యమును పాలించి గురు శుశ్రూషాపూర్వకముగా గుర్వాజ్ఞలను పాటించి కుటుంబాసక్తి మొదలగు రజోగుణవ్యవహారములయందు చిక్కుకొనక నియమానుసారము సాంగోపాంగముగను, అర్థముతోడను వేదములను అధ్యయనము చేయవలెను. అభ్యాసశబ్దమునకు "అనేక ఆవృత్తులు" పలుకుట అనియే అర్థము అయినను తాత్పర్యానురోధముచే సాంగోపాంగ అర్థసహిత అధ్యయనము మాత్రమే అభ్యాస పదముచే నిక్కడ గ్రహించవలెను. ఏలనన కర్మ, ఉపాసన, జ్ఞానకాండలనబడు

మూడు కాండలయందలి కర్మకాండోక్త కర్మానుష్ఠానముచే చిత్త శుద్ధిని సంపాదించవలెను. ఉపాసనాకాండయందు చెప్పబడిన ఉపాస నానుష్ఠానముచే మల, విక్షేపాదిదోషములను పోగొట్టి, జ్ఞానకాండోక్త శ్రవణ, మననాది ఉపాయానుష్ఠానములద్వారా స్వరూపానుసంధాన మున నిష్ఠయుంచి జీవాత్మపరమాత్మ అభేదానుభవపర్యంతము చేర వలెను. అనునది వేదాభ్యాసపద తాత్పర్యముచే గ్రహించబడవలసిన అర్థము. "ఆవృత్తి" అను ముఖ్యార్థముకూడ విడువబడరాదు. ఎల్ల ప్పుడును వేదవేదాంగములను అర్థానుసంధానపురస్సరముగ నిత్యము స్వాధ్యాయరూపమున పరిశీలించుచుండవలెను. అటులనే ఇతరులకు అధ్యాపనము చేయవలెను. ప్రవచనము చేయవలెను, అనగా ఉప న్యాసరూపమున ప్రకటించవలెను. ఈ అర్థమంతయు వేదాభ్యాసశబ్ద మున ఉన్నదని గ్రహించవలెను.

నేడు బ్రాహ్మణులు వేదాధ్యయనము చేయుటలేదు. వేదాధ్య యనము చేయలేక పోయినచో ప్రస్థానత్రియమైనను అధ్యయనము చేయవలెను. అదియును చేయలేక పోయినచో భగవద్గీతయును, మను స్మృతి మొదలగు స్మృతులును అధ్యయనము చేయవలెను.

## తపః

శాస్త్రమునందు కృచ్ఛ్రచాంద్రాయణాదులద్వారా శరీర మును శోషింపజేయుట తపమని చెప్పిరి. యాజ్ఞవల్క్యసంహిత యందు ఇట్లు ఉన్నది.

*విధినోక్తేన మార్గేణ కృచ్ఛ్రచాన్ద్రాయణాదిభిః।*
*శరీరశోషణం ప్రాహుః తపసాం తప ఉత్తమమ్॥*

"శాస్త్రప్రతిపాదితమగు మార్గము ననుసరించి కృచ్ఛ్రచాం ద్రాయణాదులద్వారా శరీరమును శోషింపజేయుట ఉత్తమమయిన తపము."

అనాదినుండియు సంభవించిన క్లేశవాసనలద్వారా చిత్తము నందు నానావిధములగు పాపములనెడు సంస్కారములును, రాజస తామస ప్రధానములగు దోషములును ఉండును. వానిని లోపింపజేయుటకు తపము ఆవశ్యకము. కాని ఆ కృచ్ఛ్రచాంద్రాయణాదులు మందాధికారివిషయమున చెప్పబడినవి. జిజ్ఞాసువునకు వివిధపాపముల నుండియు నివృత్తి అనెడు తపమే విధించబడినది.

*యే పాపాని న కుర్వన్తి మనోవాక్కాయ కర్మభిః ।*
*తే తపన్తి మహాత్మానో న శరీరస్య శోషణమ్ ॥*

"ఎవరి మనస్సు, వాక్కు, శరీరము పాపములను చేయవో, ఆ మహాత్ములే తపశ్శాలురు. శరీరమును శోషింపజేయుట తపముకాదు."

మానసిక, వాచిక, కాయిక పాపములనుగురించి మనువు ఇట్లు చెప్పెను.

మానసిక పాపములు :–

*పరద్రవ్యేష్వభిధ్యానం మనసాఽనిష్టచిననమ్*
*వితథాభినివేశశ్చ త్రివిధం కర్మ మానసమ్ ॥*

"ఇతరుల ధనమును అన్యాయముగా గ్రహించవలెనను కోరికయును, మనస్సునందు హింసయు, మోసమును చేయవలెనను కోరికయును పరలోకము లేదు, శరీరమే ఆత్మ మొదలగు అసత్యపు ఆలోచనలును–ఈమూడును మానసపాపములు."

వాచికపాపములు:–

*పారుష్యమనృతం చైవ పైశున్యం చాపి సర్వశః ।*
*అసంబద్ధప్రలాపశ్చ వాఙ్మయం స్యాచ్చతుర్విధమ్ ॥*

"కఠోరవాక్కులు, అసత్యప్రలాపములు, చాడీలు చెప్పుట, నిష్ప్రయోజనమగు మాటలు చెప్పుట– అను ఈనాలుగు వాచికపాపముల రకములు."

కాయిక పాపములు:—

*అదత్తానాముపాదానం హింసా చైవావిధానతః।*
*పరదారోపసేవా చ శారీరం త్రివిధం స్మృతమ్॥*

"చౌర్యము, నిషిద్ధమగుహింస, పరస్త్రీగమనము— ఈ మూడును శారీరక పాపములు."

ఈ మూడుపాపములకు దూరముగానుండు ఆచరణ తపము. ఈమూడురకములగు పాపములను చేయనివారు పాపనివృత్తికొరకు కృచ్ఛ్రచాంద్రాయణాదులను ఆచరించ నవసరము లేదు.

తపఃప్రభావము చాలగొప్పది.

*యత్ దుస్తరం యత్ దురాపం యత్ దుర్గం యచ్చ దుష్కరమ్।*
*తత్సర్వం తపసా సాధ్యం తపో హి దురతిక్రమమ్॥*

"దేనిని దాటుట కష్టమో, దేనిని పొందుట కష్టమో, దేనియందు ప్రవేశించుట కష్టమో, దేనిని చేయుటకు శ్రమపడవలెనో అవన్నియును తపస్సుచే సిద్ధించును. తపశ్శక్తిని ఉల్లంఘించుట కష్టము."

## జ్ఞానమ్.

పరోక్షము, అపరోక్షము అని జ్ఞానము రెండు రకములు. శాస్త్రములద్వారాను, గురువుద్వారాను పరమార్థతత్త్వరూపుడగు పరమాత్ముడు ఉన్నాడు అను నిశ్చయమునుపొందుట పరోక్షజ్ఞానము. శ్రవణముచేసిన పరమాత్మస్వరూపము మనననిదిధ్యాసనములద్వారా ప్రత్యగాత్మస్వరూపముతో అభేదముగా సాక్షాత్కారమగుట అపరోక్షజ్ఞానము. ఇది జ్ఞానమునకు చెప్పు సామాన్యవివరణము.

జ్ఞానము సాత్త్వికాదిభేదములచే మూడురకములుగా శ్రీమద్భగవద్గీతయందు వివరింపబడినది.

## సాత్త్విక జ్ఞానము.

ఈశ్వరుడు, హిరణ్యగర్భుడు, విరాట్టు మొదలగువారియం దును, మానవ, పశు, పక్ష్యాది వివిధప్రాణులయందును అవ్యయుడును, నాశరహితుడును, అవిభక్తుడును, భేదరహితుడును, ఏకస్వరూపుడును, అద్వితీయుడును, పరమార్థస్వరూపుడును, స్వయంప్రకాశుడును, ఆనంద ఘనుడును అగు ఆత్మ వేదాంతవాక్యవిచారముచే అంతఃకరణవృత్తి విశేషమగు సాక్షాత్కారముద్వారా గోచరించును. నిరోధసమాధి ద్వారా త్వంపదలక్ష్యమును, తత్పదలక్ష్యమును అగు శుద్ధతత్త్వము సాక్షాత్కరించగనే ఈరెంటి ఐక్యమును గోచరింపజేయు "తత్త్వమసి" అను వేదాంతవాక్యవిచారముచే జనించిన నిర్వికల్పసాక్షాత్కారరూప మగు బ్రహ్మవిద్య అను వృత్తి ఎప్పుడు కలుగునో అప్పుడు ఆవరణ భంగముద్వారా మూలావిద్యానివృత్తి అయి బ్రహ్మసుఖసాక్షాత్కార రూపమగు అనుభవము కలుగును. అదియే సాత్త్వికజ్ఞానము.

## రా జ స జ్ఞా న ము.

భేదముతో ప్రతీతములగు ప్రాణులన్నిటియందు సుఖదుఃఖాది తారతమ్యముచే ప్రతిశరీరియందును పరస్పరవైలక్షణ్యముకల ఆత్మ బుద్ధిని కలిగింపజేయు జ్ఞానము రాజసజ్ఞానము.

## తా మ స జ్ఞా న ము.

నిస్సంగుడును, కూటస్థుడును అగు ఆత్మను వికారి యని తలచు టయును, అనాత్మవస్తువుయందు ఆత్మబుద్ధిని పొందుటయును తామస జ్ఞానము అనబడును.

ఈ మూడురకముల జ్ఞానములలోను మనువు వివరించినది సాత్త్వికజ్ఞానము.

## శౌ చ మ్.

శౌచం తు ద్వివిధం ప్రోక్తం బాహ్యమాభ్యన్తరం తథా।
మృజ్జలాభ్యాం స్మృతం బాహ్యం మనశ్శుద్ధిరాభ్యన్తరమ్ ॥

"శౌచము రెండు రకములు. బాహ్యము, ఆభ్యంతరము. మట్టి, నీరు మొదలగువానితో చేయబడు శౌచము బాహ్యశౌచము. మనశ్శౌచము ఆంతరిక శౌచము."

## అంతః శౌచమ్.

అంతఃశౌచమును యోగసూత్రములు ఇట్లు వివరించినవి:—

*"మైత్రీకరుణాముదితోపేక్షాణాం సుఖదుఃఖపుణ్యాపుణ్యవిషయాణాం భావనాతః చిత్తప్రసాదనమ్ ॥*

"సుఖముగానున్నవారితో మైత్రి, దుఃఖించుచున్నవారియందు దయ, పుణ్యములుచేయువానిని హర్షించుట, పాపములుచేయువానికి దూరముగా నుండుట– వీనిచే చిత్తశుద్ధి కలుగును."

సుఖముగానున్న మిత్రులందరియందును, "మనమిత్రులు అందరును సుఖముగ నున్నారు. ఇది చాలబాగుగ ఉన్నది"అని తలచవలెను. ఈర్ష్యకలిగి ఉండరాదు. దుఃఖముతో నున్న ప్రాణులందరియందును "ఈ అందరిదుఃఖమును ఎట్లు నివృత్తిని పొందును." అని కృపార్ద్రదృష్టులు కలిగియుండవలెను. వారియందు ఉపేక్షకాని, వారు కష్టపడుచున్నందున సంతోషించుటకాని కూడదు. పుణ్యాత్ములు కన్పించినచో వారి పుణ్యకార్యములను సమర్థించి హర్షమును ప్రకటించవలెను. అసూయకాని, ఉపేక్షకాని కూడదు. పాపాత్ములకు దూరముగా నుండవలెను. వారియందు ఔదాసీన్యము వహించవలెను. వారి కృత్యములను ఆమోదించరాదు. కాని ద్వేషముకూడ కలిగియుండరాదు.

1. మైత్రిచే రాగము, ద్వేషము, ఈర్ష్య మొదలగునవి నివృత్తిని పొందును.

2. కరుణచే ద్వేషము, గర్వము నివృత్తిని పొందును.

3. మోదభావముచే పుణ్యముచేయనందున కలుగు చింత నివృత్తిని పొందును.

4. ఉపేక్షాభావముచే పూర్వముచేసిన పాపాచరణముచే కలిగిన చింత నివృత్తిని పొందును.

ప్రపంచములో ఎక్కువమంది మనుష్యుల అంతఃకరణము రాగద్వేషములచేతనో పుణ్యములు చేయలేదనియో, పాపములు చేసితిమనియో మాలిన్యమును పొంది యుండును. ఏసుఖమునందు మోహము కలుగునో, ఆసుఖమును అనుభవించినపిదప రజోగుణపరిణామమగు "ఇట్టి సుఖము ఎల్లప్పుడును లభించవలె"నను-బుద్ధివృత్తి రాగము. ఆ మనోరథము దృష్ట, అదృష్టసామగ్రిలులేనిదే కలుగదు. కావున రాగము ఎల్లప్పుడు చిత్తమును మలినము చేయుచుండును. ఈ సుఖముగా నున్నవారందరును నామిత్రులే అనుభావము కలిగిన తోడనే వారిసుఖము తనసుఖమే యగును. తండ్రి రాజ్యమునుండి నివృత్తిని చెందినపుడు రాజ్యము కుమారునకు చెందును. కుమారుని రాజ్యము తనరాజ్యమే కదా. ఈభావము కలిగినతోడనే తండ్రికి కుమారుని రాజ్యమునందు రాగము కలుగదు. పుత్రుడు రాజ్యము చేయుచున్నందున అతనికి అసూయాద్వేషములు కలుగవు. అట్లనే ఇతరులసుఖము తనసుఖమే అను భావము కలిగియున్నచో సుఖము కోరువానియందు రాగము ఉండదు. సుఖము అనుభవించువారియందు ఈర్ష్యాద్వేషములు ఉండవు. ఈవిధముగా మైత్రీభావముచే ఈర్ష్యా, ద్వేషములు, అసూయ మొదలగునవి నివృత్తిని పొందుటచే వర్షఋతువు పోయినతరువాత జలము నిర్మలమగునట్లుగా చిత్తము నిర్మలమగును.

దుఃఖముచే ద్వేషము కలుగును. ద్వేషము తమోగుణ, రజోగుణ పరిణామవిశేషమగు ఒకానొక బుద్ధివృత్తి. "దుఃఖము నాకు

కలుగరాదు." అనునది ద్వేషస్వరూపము. ఆద్వేషమునకు హేతుభూతమగు దుఃఖము వ్యాఘ్రాదులగు శత్రువులు అనేకములు ఉండుటచే పోదు. కావున ఈ ద్వేషము మానవహృదయమును ఎప్పుడును తినివేయుచుండును.

తనకు దుఃఖము కలుగుట ఎట్లు ఇష్టము కాదో, అటులనే ఇతరులకు కూడ దుఃఖము కలుగరాదను భావముతో దుఃఖించువారిపై కరుణ కలిగియున్నప్పుడు శత్రువులనుండి ద్వేషము నివృత్తిని పొంద చిత్తము ప్రసన్నతను పొందును. అటులనే కరుణాభావముచే "నేను సుఖముగా నున్నాను" అను గర్వముకూడ కలుగదు. మానవుడు స్వభావముచే పుణ్యానుష్ఠానరహితుడును, పాపానుష్ఠానపరాయణుడును అయి ఉండును. ఈకారణముచే ఇతరులు సుఖపడుచు ఉండగ చూచి మానవునకు పశ్చాత్తాపము కలుగును. నేను ఇట్టి సుఖమును కలుగజేయు పుణ్యకర్మము ఏల చేయలేదు. అటులనే దుఃఖమును అనుభవించుసమయమున "ఈదుఃఖమునకు కారణమును ఎట్లు ఆచరించితిని" అని పశ్చాత్తాపము కలుగును. పుణ్యాత్ములపట్ల మోదమును అనుభవించినప్పుడు పుణ్యకర్మవాసనచే ఆమహాత్ముల పుణ్యభావములు తనయందు ప్రవర్తించును. అట్లు ఉత్తమమగు పుణ్యావస్థయందు ప్రవర్తించినవానికి పుణ్యము చేయనందున చింతించవలసిన అవసరము కూడ ఉండదు.

పాపముచేయువారియందు ఉపేక్షాభావము కలిగియుండుటచే ఔదాసీన్యము పెరిగి తన పాపాచరణమునందుకూడ ఔదాసీన్యము ఏర్పడును. పాపమునుండి నివృత్తిని పొందుటచే పాపకృత్యములను చేయుటవలన అనుభవించవలసిన చింతను అనుభవించ పనిలేదు. ఇట్లు మైత్రీభావముచే అంతఃకరణమునుండి రాగద్వేషములు నివృత్తిని పొంది చిత్తము నిర్మలమగును.

## బాహ్యశౌచ, అంతఃశౌచములు ఎందుకు?

శౌచాత్స్వాఙ్గజుగుప్సా పరైరసంసర్గః। (యోగసూత్రము)

బాహ్యశౌచముచే తనశరీరమునందు జుగుప్స కలుగును. స్త్రీపుత్రాదుల సంసర్గము కలుగదు. జలము, మృత్తిక, సబ్బు మొదలగువానిచే ప్రతిరోజు ఎన్నిమారులు శరీరము శుభ్రముచేసినను, స్నానముచేయుచున్నను, 60, 70 సంవత్సరములు ఏకధాటిగా శరీరమును శుభ్రముచేసినను, దుర్గంధమును పోగొట్టుటకు రోజు నూనె, అత్తరు, సెంటు మొదలగునవి రాయుచున్నను శరీరమునుండి దుర్గంధము పోదు. ఈవిషయమును అనుభవములోనికి తెచ్చుకొనినచో శరీరముపై అసహ్యము కలుగును. "శరీరము మలమూత్రములతో నిండిన, నిందనీయమగు మహామలినపదార్థము" అని దానియందు తిరస్కారభావము పుట్టును. తనశరీరముపై తిరస్కారము కలిగినప్పుడు స్త్రీపుత్రాదులతో సంసర్గము కలిగించుకొనుటకుకూడ విరక్తి కలుగును.

అంతట సంసర్గమునుకూడ పోగొట్టుకొనును. ఇది బాహ్యశౌచముయొక్క ఫలము.

అంతఃశౌచముయొక్క ఫలము యోగసూత్రమున ఇట్లు చెప్పబడినది.

"సత్త్వశుద్ధిసౌమనస్యైకాగ్ర్యేన్ద్రియజయాత్మదర్శనయోగ్యత్వాని చ.

"అంతఃశౌచముచే సత్త్వశుద్ధియు, ప్రసన్నమగు మనస్సు, చిత్తస్థైర్యము, ఇంద్రియవిజయము, ఆత్మదర్శనయోగ్యత్వమును సిద్ధించును. సుఖము అనగా ప్రకాశధర్మముకల సత్త్వగుణము రజస్తమోగుణములచే పరాభవమును పొందరాదు అను భావము సత్త్వశుద్ధి. సత్త్వశుద్ధి కలిగినచో సౌమనస్యము కలుగును. సౌమనస్యముచే చిత్తైకాగ్రత కలుగును. చిత్తైకాగ్రతచే ఇంద్రియజయము కలుగును. ఇంద్రియజయముచే ఆత్మదర్శనయోగ్యత్వము కలుగును."

ఈరోజులలో అంతఃశౌచము పూర్తిగా లోపించిపోయినది. కొద్దో గొప్పో బాహ్యశౌచము కలదు. ఈ అపవిత్రమగు శరీరమును తిరస్కరించుటకుబదులు ఇది పవిత్రమయినది అని తలచెదము. భాగవతమున కలియుగప్రసంగమున "స్నానమేవ ప్రసాదనమ్"అని చెప్పబడినది. "కలియుగమునందు బాహ్యస్నానమే చేయవలెను." అనునది పవిత్రతకు చిహ్నముగా తలచబడుచున్నది.

## ఇంద్రియ నిగ్రహము.

స్వాభావికముగా విషయముల వైపునకు మొగ్గు ఇంద్రియములను విషయములనుండి మరలించి ఆత్మచింతనమునందు నిమగ్నమయిన మనస్సును ఇంద్రియములు అనుసరించునట్లు ఇంద్రియములను ప్రేరేపించుట ఇంద్రియనిగ్రహము. ఇంద్రియముల బాహ్యవిషయగామిత్వమును కఠోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నవి:—

*పరాఞ్చి ఖాని వ్యతృణత్స్వయంభూస్తస్మాత్పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్ ।*
*కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షదావృత్తచక్షురమృతత్వమిచ్ఛన్ ॥*

"స్వయంభువు ఇంద్రియములను బాహ్యదృష్టితో సృష్టించెను. కావున అవి బహిర్ముఖములుగనే యుండును. అంతర్ముఖములుగా నుండవు. మోక్షమునుకోరు శక్తిమంతుడు విషయములనుండి ఇంద్రియములను త్యజించి ప్రత్యగాత్మను చూడగలడు. అనగా ఆత్మజ్ఞానమును పొందగలడు."

## ఇంద్రియ ప్రాబల్యము

ఈశ్రుతియందు ఇంద్రియములకు ఆత్మదర్శనసామర్థ్యము లేదనియు, బాహ్యవృత్తిపరాయణములనియు వివరించబడినది. ఇంద్రియనిగ్రహము లేనిదే ధర్మ, అర్థ, కామములనెడు త్రివర్గములను సాధించుటకు వలయు శక్తి కలుగదు. ఇక మోక్షమను చతుర్థపురుషార్థము

సంగతి వేరు చెప్పనేల? శిక్షణపొందని గుర్రము తనరౌతును మార్గ మధ్యమునందలి కందకమున పడవేసి బాధించునట్లును, చేరవలసిన చోటికి చేర్చనట్లును, ఇంద్రియనిగ్రహము లేనివానిని ఇంద్రియములు విషయభోగమునకు మరలించి మోక్షద్వారమువైపునకు వెళ్ళ నియ్యవు. అంతియే కాదు. నరకమునందుకూడ పడవేయును.

జ్ఞానేంద్రియములు 5. శ్రోత్రము, త్వక్, చక్షువు, జిహ్వా, ఘ్రాణము. శ్రోత్రమునకు విషయము శబ్దము. కావున సంగీతాదులు వినవలెనను కోరిక కలుగును. త్వగింద్రియముయొక్క విషయము స్పర్శము. దానితో కోమలమగు శయ్య, చామరము మొదలగువాని యందు ప్రేమ కలుగును. చక్షువుయొక్క విషయము రూపము. దానితో నాటకము చూడవలెనని కోరిక కలుగును. జిహ్వాయొక్క విషయము రసము. దానితో రుచికల పదార్థములను అనుభవించ వలెనని తోచును. ఘ్రాణముయొక్క విషయము గంధము. దానిచే అత్తరు మొదలగునవి అనుభవించవలెనని కోరిక కలుగును. ఈఐదు విషయములను ఎంతకాలము అనుభవించుచు నుందురో అంతకాలము ఇంద్రియనిగ్రహము కలుగదు.

మనస్సు విషయాసక్తిని విడనాడకుండనప్పుడు, పట్టుదలతో ఇంద్రియములను విషయములనుండి నివర్తింపజేయుటచే ఇంద్రియనిగ్రహము సిద్ధించదు. మనస్సు ఇంద్రియములనుండి తప్పుకొని, ఇంద్రియములు స్వాభావికముగా విషయములనుండి మరలినప్పుడే యథార్థమగు ఇంద్రియనిగ్రహము కలుగును.

మనువు ఇట్లు చెప్పెను :—

*న తథైతాని శక్యన్తే సన్నియన్తుమసేవయా।*
*విషయేషు ప్రజుష్టాని యథా జ్ఞానేన నిత్యశః॥*

"విషయపదార్థములను సేవించు ఇంద్రియములను, విషయ పదార్థములను అనుభవించకుండ చేయుటచే సంయమములో నుంచ లేము. జ్ఞానముచే (వివేకముచే) వానిని వశములో నుంచుకొనుట సులభము."

మాయికపదార్థములయందు అనిత్యత్వము, తుచ్ఛత్వము తెలియనంతవరకు ఆపదార్థములను భోగమునుండి ఎంతశ్రమపడి ఆపి నను వానివైపు మనస్సు పరుగిడును. వస్తువును వస్తురూపమున శుద్ధ ముగ తెలిసికొనినవెంటనే దానియందలి మోహము తనంతట తాను నశించును. ఎటులనన స్త్రీశరీరము పైకి సుందరముగ కన్పట్టును. కాని శరీరము మలమూత్రమాంసాది చెడుపదార్థములతో నిండి యున్నది అను వివేకముతో కూడిన జ్ఞానము కలిగినప్పుడు ఆవిష యమునందు మోహము, ఆకర్షణము పోవును. అందు ఏవిధమగు ఆసక్తియును ఉండదు.

## ధర్మాచరణము.

ధర్మాచరణమనగా శాస్త్రవిహితములగు వర్ణాశ్రమాది ధర్మ ములను యథావిధిగా పాలించుట అని చెప్పవచ్చును. కణాదుడు వైశేషికదర్శనమునందు "యతోఽభ్యుదయనిఃశ్రేయససిద్ధిః స ధర్మః" అని చెప్పెను. ఈలోకమునందలి సుఖములు, పరలోకమునందలి స్వర్గాదులు, మోక్షము లభించుటకు వీలగు వేదోక్తమగు ఆచరణమే ధర్మము అని చెప్పెను. దానాది ధర్మకార్యములు అభ్యుదయహేతు వులు. శ్రవణ, మనన, నిదిధ్యాసనములను ధర్మాచరణములు నిశ్శ్రేయ సహేతువులు. ధర్మము, దేశధర్మము, కులధర్మము, జాతిధర్మము, వయోధర్మము- గుణధర్మము, శరీరధర్మము, కాలధర్మము, ఆప ద్ధర్మము అని అనేకవిధములుగా మహాభారతమునందు వివరించ బడినది.

దక్షిణదేశమున బ్రాహ్మణులుకూడ మేనమామకూతురును వివాహమాడుదురు. ఇది దేశధర్మము.

"వాసిష్ఠాః పఞ్చచూడాః" వశిష్ఠగోత్రమునకు చెందిన బ్రాహ్మణులు పంచశిఖలను కలిగియుండవలెను. ఇది కులధర్మము.

బ్రాహ్మణేన షడఙ్గో వేదోఽధ్యేయో జ్ఞేయశ్చ :- బ్రాహ్మణుడు ఆరు అంగములతో కూడిన వేదమును అధ్యయనము చేయవలెను. అర్థమును గ్రహించవలెను. ఇది జాతిధర్మము.

అష్టవర్షం బ్రాహ్మణ ముపనయీత :-ఎనిమిది సంవత్సరములు వయస్సుకల బ్రాహ్మణబాలకునకు ఉపనయనము చేయవలెను. ఇది వయోధర్మము.

పట్టాభిషేకమును పొందిన క్షత్రియుడు ప్రజలను పాలించవలెను. ఇది పట్టాభిషేకగుణముతో కూడియుండుటచే గుణధర్మము.

సంక్రాన్తౌ గ్రహణే వాపి దత్తం భవతి చాక్షయమ్:- సంక్రాంతి రోజున కాని, గ్రహణమునందు కాని చేసినదానమునకు అక్షయమగు ఫలము కలుగును. ఇది కాలధర్మ మనబడును.

తన కులము, జాతి, వయస్సు, గుణములు మొదలగువానికి తగినట్లు జీవితము గడుపుకొను వృత్తి మొదలగునవి చేయుట ఆపద్ధర్మము.

## ధర్మలక్షణము.

వ్యాసభగవానుడు ధర్మలక్షణమును వర్ణించుచు "ధారణాద్ధర్మమిత్యాహుః" అని చెప్పెను. శాస్త్రమునందలి ధర్మమును వినుటచే కాని చెప్పుటచే కాని ధర్మముకాదు. అట్లు ధారణచేయుటచే అనగా ఆచరించుటచే ధర్మ మనబడును.

మనువు ఇట్లు చెప్పెను:-

*ధృతిః క్షమా దమోఽస్తేయం శౌచమిన్ద్రియనిగ్రహః ।*
*ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్ ॥*

"ధైర్యము, క్షమ, దమము, అస్తేయము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, బుద్ధి, విద్య, సత్యము, అక్రోధము- ఇట్లు ధర్మలక్షణము పదివిధములుగ నుండును.

ధర్మమునకు సత్యము, శౌచము, దయ, దానము అని నాలుగు పాదములు. వానిలో సత్యము సర్వప్రధానము. ఏలనన సత్యము లోపించినచో ఇతరధర్మములను ఆచరించుటచే ఫలము కలుగదు.

పతంజలి భగవానుని సూత్రమును పరికించుడు:—

*సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వమ్ ।*

సత్యము స్థిరపడినచో యజ్ఞాదిసకలకర్మలవలనను కలుగు యథార్థఫలము లభించును.

తన అపవిత్ర శరీరమునందు గ్లానిని అనుభవించుటయును, దుర్జనసంసర్గమునకు దూరముగా నుండుటయును శౌచమునకు ఫలము. దయచే ప్రాణిపీడనమువలన కలుగు పాపమునుండి విముక్తిని పొందుదుము. దానమునకు ఫలము ధర్మకార్యములకు ధనమును వినియోగించుటచే లోభజనితపాపమునుండి విముక్తినొందుట. ఇట్లు సత్యము, శౌచము, దయ, దానము ఈనాలుగును ధర్మాచరణమునకు సాధనములుగా నెంచబడినవి. ఈ నాలిగింటిని కలిగియుండనివాడు ధర్మమును ఆచరించలేడు. కావున ఈనాలుగు ధర్మమునకు పాదములని చెప్పబడినవి.

పద్మపురాణమునందుకూడ ధర్మలక్షణము కలదు,

*బ్రహ్మచర్యేణ సత్యేన మఖపఞ్చకవర్తనైః ।*
*దానేన నియమైశ్చాపి క్షాన్త్యాశౌచేన వల్లభ ॥*
*అహింసయా సుశాన్త్యా చ అస్తేయేనాపి వర్తనైః ॥*
*ఏతైర్దశభిరఙ్గైస్తు ధర్మమేవ ప్రపూరయేత్ ॥*

"బ్రహ్మచర్యము, సత్యము, పంచమహాయజ్ఞములు, దానము, నియమములు, క్షమ, శౌచము, అహింస, శాంతి, అస్తేయము— అను ఈపది అంగములతోడను ధర్మమును పూరింపవలెను."

## ఆ త్మ వి చా ర ము.

సదసద్వివేకముద్వారా అపరోక్షజ్ఞానమునకు ఉపయోగించు ధ్యానము ఆత్మవిచారము. ఆకారణముననే ఒంటరిగానుండి ఆత్మ విచారము చేయు నరుడు మోక్షమును పొందును.

స్వరూపవిచారమునకు ఆరంభమున సర్వకార్యములను అనగా జగత్తును కారణమగు అవిద్యయందు లయము చేయవలెను. ఆ అవిద్య కూడ అధ్యస్తమేనని తెలిసికొనవలెను. సాక్షిభిన్నమగు పదార్థమేదియు లేదు అను జ్ఞానమును పొందవలెను. ఇట్లు పదార్థనిర్ణయము చేయగా నవశిష్టమగు స్వరూపమును ధ్యానించవలెను. ఈవిషయమున జీవన్ముక్తి ఇట్లు చెప్పుచున్నది:—

*విలాప్య వికృతిం కృత్స్నాం సంభవవ్యత్యయక్రమాత్ ।*
*పరిశిష్టం సన్మాత్రం చిదానన్దం విచిన్తయేత్ ॥*

"కార్యములను కారణములయందు లయముచేసి ఈక్రమములో వికృతులను లయముచేయుచు రాగా చివరకు మిగులునట్టి సన్మాత్రమైన చిదానందబ్రహ్మమును ధ్యానించవలెను."

ఈసందర్భమున భాగవతములో ఇట్లు చెప్పబడినది—

*మనః స్వబుద్ధ్యాఽమలయా నియమ్య క్షేత్రజ్ఞ ఏతాం వినయేత్తమాత్మని ।*
*ఆత్మానమాత్మన్యవరుధ్య ధీరో లబ్ధోపశాన్తిర్విరమేత కృత్యాత్ ॥*

"తన నిర్మలబుద్ధిచే మనస్సును అదుపులోనికి తేవలెను. ఆబుద్ధిని క్షేత్రజ్ఞునియందు (శరీరాదికముయొక్క ద్రష్టయగుజీవునియందు) లయము చేయవలెను. ఆక్షేత్రజ్ఞుని సాక్షియగు ఆత్మయందు లయము చేయు

వలెను. ఆత్మను పరబ్రహ్మమునందు లయముచేసి శాంతిని పొందు యోగి అన్నిపనులనుండియు విరక్తిని చెందును.”

## రజోగుణలక్షణము.

*ఆరమ్భరుచితాఽధైర్యమసత్కార్యపరిగ్రహః।*
*విషయోపసేవా చాజస్రం రాజసం గుణలక్షణమ్॥*

“ఆరంభమునందు అనురాగము, తొందర, అసత్కార్యములను చేయుట,నిరంతరము విషయసుఖములను అనుభవించుట-ఈనాలుగును రజోగుణలక్షణములు.”

## ఆరమ్భరుచితా.

నిత్యము నవీనమగు నడవడిక కల్గియుండవలెనని తోచును. ఈ నిత్యనవీనత్వమువలన చిత్తచాంచల్యము కలుగును. అంతట ధర్మమునందు ప్రవృత్తి కలుగను. లౌకికములందు ప్రవృత్తి కలిగి యుండుటచే, అనగా ఇండ్లు, పొలములు మొదలగునవి సంపాదించవలెనని ప్రయత్నముచేయుట, వానిని ఆరంభించుట- ఇట్టివానిచే అంతకంతకు ప్రవృత్తియందు ప్రేమ కలిగియుండుట ఆరంభమునందు అనురాగము అనిపించుకొనును.

రజోగుణప్రవృత్తి కల నరుడు ఏపనినైనను ఆరంభించుటయందు సత్యాసత్యములను విచారించడు. తాను అనేకవికారములకు లోనయి అనేక కార్యములను ఆరంభించును. ఎట్లన, అట్టివాడు రాజసమును పెంపొందించు అనేకగ్రంథములను వ్రాయును; వ్రాయించును. కాని ఉపనిషత్తులు మొదలగు సాత్త్వికగ్రంథములయందు ఏమియు ప్రేమ కలిగియుండడు. చిత్తము రజోమయముగుటచే సాత్త్వికసంపదయందు ప్రవర్తించడు. మరియు, తనకుటుంబమును పెంచుకొనుటకు అనేకవిధములగు దంభములను చేయును. పాపకృత్యములను ఆచరించును. జీవులయందు ద్వేషముతో [illegible]వృత్తులను పూరించును. ఇండ్లు, వాహ

నములు మొదలగువానిపై తరచు ప్రేమనుచూపించును. అసత్ శీలుడగు నరుని అనురాగము పట్టుదల, ఓర్పు, దయ, శమము, దమము, శ్రద్ధ, తితిక్ష మొదలగు వానియందు ఉండదు. సత్త్వగంధమైనను అతనియందు లేకపోవుటయే ఇందుకు కారణము. కావున అతనికి పాపజనకములగు పదార్థములయందే అనురాగముకలుగును. దానికి ఫలము అంతమున నరకమే. ఈఅసచ్ఛీలముతో చేయుపనులు ఆరంభమునందు మాత్రమే అనురాగము కలవి. కావున కార్యసమాప్తి సక్రమముగా చేయుట అనునది అట్టిజనులు ఎరుగరు. ఆరంభమునందు మాత్రము ప్రయత్నముచేసి విరమించుకొనెదరు. సాత్త్వికులగు నరులు కార్యారంభమునందు అనురాగమును ప్రకటించనే ప్రకటించరు. ఒకవేళ ప్రకటించినచో పూర్తిచేసి విశ్రమించెదరు.

## అధైర్యమ్

సర్వకళ్యాణకరమగు ప్రవృత్తికి అసాధారణకారణము పట్టుదల. వ్యవహారమున పట్టుదల లేనందున అనేకకార్యములు పాడగుచున్నవి. యజ్ఞాది శ్రౌత, స్మార్తకార్యములయందుకూడ పట్టుదల లేనిచో పాడగును. శమాదిషట్కమును పాలించవలెనను పట్టుదల తప్పక కావలెను.

పట్టుదల లేనివాడు ప్రపంచమున ఏపనియు చేయలేడు. కార్యారంభమును అందరును చేయగలరు. కాని అది పరిపాకము చెందునంతవరకు ఓపికపట్టువారు తక్కువ. కొందరు జ్ఞానులగు మహాత్ముల చెంతకు వారి సత్సంగమునకై తరచు వెళ్ళెదరు. సత్కర్మల ద్వారా అంతశ్శుద్ధిని పొందవలెనని వారి అంతఃకరణమున తోచును కూడాను. భగవద్భక్తిచే మనశ్చాంచల్యమును పోగొట్టుకొనవలెననియు, సత్పురుషులచెంత శ్రవణముచేసి జ్ఞానమును స్వరూపసాక్షాత్కారమును పొందవలెననియు వారికి తోచునుకూడాను. కాని ఈసంకల్పములన్నియు పట్టుదలలేనిదే సిద్ధించవు.

సత్కర్మములు, భక్తి, జ్ఞానము మొదలగునవి పొందుటకు చాల సమయము కావలెను. గురువుయందును, షట్శాస్త్రములయందును శ్రద్ధ కలిగిననే అవి పూర్తి అగును. వీని అన్నిటికిని పట్టుదల కావలెను. కావుననే మహాత్ముడు భర్తృహరి ముముక్షుని కుటుంబముగా గిణింపదగిన గుణములలో పట్టుదలను తండ్రిగా వర్ణించెను. "ధైర్యం యస్య పితా" అని. సత్పురుషులే పట్టుదల కలిగియుందురు. అసత్పురుషులకు పట్టుదల యుండదు. ఫలితము అసత్పురుషులకు దుఃఖమే.

## అసత్కార్యపరిగ్రహః.

శాస్త్రమర్యాదలను పాటించక నిషిద్ధకర్మలను ఆచరించుట అనగా అన్యాయముగా ధనమును సంపాదించుట, దంభము, దర్పము, అభిమానమును చూపు నిషిద్ధకర్మములను ఆచరించుట, నిర్దయులయి ఇతరులను బాధించుట ఇవి అన్నియు అసత్కార్యపరిగ్రహమున చేరును.

ధర్మము, అర్థము, కామము, మోక్షము ఈనాల్గును సత్కార్యములు. వానికొరకు చేయు ప్రయత్నములుకూడ సత్కార్యములే. యజ్ఞయాగాది పుణ్యకర్మములు, న్యాయముగా ధనమును సంపాదించుట, సాత్త్వికసంపద లభించుటతోడనే కోరికలను, జగత్తును మిథ్యగా దలంచి జీవబ్రహ్మైక్యమునందు లబ్ధికలదని తలచుట మొదలగునవి సత్కార్యములు. వీనికి విపర్యయములు అసత్కార్యములు. యజ్ఞాదులనుకూడ లోకమున గౌరవముకొరకు చేయుటలో విధ్యనుష్ఠానము సిద్ధించదు. అవి అసత్కార్యములు. అన్యాయముగా ధనమును సంపాదించి తద్ద్వారా అనేకరకములగు అనర్థములను పొందుటకూడ అసత్కార్యమే. ఇతరులకు ద్రోహముచేసి, మోసగించి, ధనమును సంపాదించి మానసికములగు వాసనలను పోషించుట అసత్కార్యము.

గురువుచెంతకు జ్ఞానశ్రవణమునకు వెళ్ళి, ఆజ్ఞానమును అచ్చటనే విడచి వచ్చువాడుకూడ అసత్కార్యమునే ఆచరించుచున్నాడు. ఇట్టి వారి నందరిని అసత్కార్యపరిగ్రహు లనవచ్చును. ఈదృష్టాంతము ఈవిషయమున వినుము:—

ఒక అసత్కార్యపరిగ్రహముకల వర్తకుడు తనకుమారునితో ఒకమహాపురుషుడు చేయు హరికథాకాలక్షేపమునకు వెళ్ళెడివాడు. ఒకరోజు ప్రసంగమున వారు ఇట్లువినిరి:— "ఆవు మేయుచుండగా అదరించకూడదు, అందువలన పాపము కలుగును." వర్తకుడును, ఆతని కుమారుడును అది విని ఇంటికి వచ్చిరి. అతనిది అపరాలదుకాణము. అపరదినుసులు బయటపడి ఉండెడివి. ఒకనాడు వర్తకుడు బయటకు ఎక్కడికో వెళ్ళెను. కుమారుడు దుకాణముపై కూర్చొని ఉండెను. అప్పుడు ఒక ఆవు వచ్చి గింజలను తినసాగెను. కుమారునికి కథలో విన్నసంగతి జ్ఞాపకమువచ్చి ఆవునుతోలలేదు. అక్కడ ఉన్నవితిని ఆవు వెళ్లిపోయెను. అంతట వర్తకుడు వచ్చి క్రిందపడి ఉన్న గింజలను చూచి ఇదేమని అడిగెను. కుమారుడు కథలోని సంగతి జ్ఞాపకము చేసెను. తండ్రి క్రోధముతో నిట్లనెను:— మూర్ఖుడా, నీకు ఇంత వరకు కథలోనిమాట జ్ఞాపకము ఉన్నదా? కథ విన్నతరువాత బట్టలు దులుపుకొనిరావలెను. ఆసంగతులు అక్కడనే విడచి రావలెను. అంతేకాని మనస్సులో ఏమాత్రము ఉంచుకొనరాదు. గురువుగారి పాదములపైబడి వచ్చిన చాలును. నాకు 70 సంవత్సరముల వయస్సు. 15 సంవత్సరములనుండి కథలు వినుచున్నాను. అయినను వినిన కథను గురువుగారి చెంతనే విడచి వచ్చుచున్నాను. ఇతరులుకూడ నావలెనే చేయుదురు. నీవలె నేను చేసినచో ఇంట ధనములేకుండ పోయియుండెడిది. భిక్షము ఎత్తుకొని తినవలసివచ్చియుండెడిది. ఇప్పటినుంచి నీవు ఎప్పుడును వినిన కథను మనస్సులో నుంచుకొనకుము. లేనిచో బాధపడవలసివచ్చును.

ఇట్లు అసత్కార్యపరిగ్రహులగు నరులు ప్రజలదృష్టిలో సత్కార్యములు చేయుచున్నట్లు నటించుదురు. కాని నిజముగా వారు చేయునవి అసత్కార్యములే. అసత్కార్యములను చేయువారికి ఆత్మసుఖము కాని, లౌకికమగు సాత్త్వికసుఖముకాని కలుగదు. కావున దానిని ముముక్షువులు త్యజించవలెను.

## విషయోపసేవా చాజస్రమ్.

నిరంతరము విషయోపభోగమునందు నిమగ్నమయి ఉండుట కూడ రజోగుణలక్షణము. శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము— ఈ 5 విషయములు శరీరనిర్వహణముకొరకు వానిని అనుభవించవలెను. విషయభోగముచే మనస్సు తృప్తినొందదు. భోగముచే తృప్తి కలుగనంతవరకు విషయములను త్యజించుట అశక్యము. అగ్నియందు ఘృతమును పోసిన అగ్ని ఆరదు. పైగ ఇంకను ప్రజ్వలించును. అటులనే అధికముగా విషయములను అనుభవించుటచే విషయానుభవమునందు కోరిక వృద్ధిపొందును. కాని తృప్తి కలుగదు. ఒక్కొక్క విషయమునందలి ఇచ్ఛచేతనే లేడి, ఏనుగు, మిడుత, మత్స్యము, భ్రమరము నశించును. ఇక 5 విషయములయందును ఆసక్తి కలిగియుండు మానవునకు ఏ గతి కలుగును? భక్తుడగు ప్రహ్లాదునకు రాజ్యసింహాసనము స్వీకరించుతరుణము సమీపించినప్పుడు దానియందలి దోషమును గమనించినందున రాజ్యమును స్వీకరించలేదు. "ఓభగవానుడా, జిహ్వాది ఇంద్రియములు మానవుని ఇంద్రియార్థములవైపునకు ఆకర్షించి ప్రపంచమున ముంచివేయును. విషమిశ్రితమగు మిఠాయి తినునప్పుడు ఆరంభమున తియ్యగనున్నను ఉదరములోనికి వెళ్ళిన వెంటనే ప్రేగులను తినివేయును.

"మన ఆహారాదులయందు రజోగుణవ్యవహారములను పెంచుకొనుచు, తోడ్తోడ విషయవాసనను నిర్మూలించి జ్ఞానమును పొందు

టకు ప్రయత్నించవలెను.” అనునది, విపరీతమగు ఆలోచన. రాజసిక వ్యవహారమును త్యజించనిదే జ్ఞానమును పొందుటకు చేయు ప్రయత్నములు సఫలముకావు.

నిత్యానందులవారు ఇట్లు పలికిరి.:—

విచారించి చూచినచో విషయాదులు కీటకమునుండి బ్రహ్మమువరకు సమానముగా నుండును. ఒక ప్రాణికిని, మరియొక ప్రాణికిని కొద్దియో గొప్పయో భేదము ఉండును. కాని ప్రాణిమాత్రమునకు కలుగు విషయసుఖము సమానమని విచారమువలన తెలియును. ఆత్మపురాణమున దృద్యఙ్ ఋషి, ఇంద్రునకును కుక్కకును సమానమగు విషయవాంఛలు కలుగునని ఇట్లు తెలిపెను.

“ఓ ఇంద్రా! అజ్ఞానముచే కలిగిన దేహాభిమానకతమున నీకును, కుక్కకును కలిగిన ఐశ్వర్యములు సమానము. వివిధ ఐశ్వర్యములయందును, దివ్యశరీరమునందును స్వర్గమునందలి అప్సరసలయందును నీకు ఎట్టి ఆసక్తి కలుగునో అటులనే కుక్కకుకూడ తన ఐశ్వర్యమునందు ఆసక్తి కలుగును. అమృతమునందు దేవతలకు కలుగు ప్రేమయే వమనముచేసిన అన్నమునందు శ్వానమునకును కలుగును. మాశరీరములకంటెను నీశరీరము కోమలమయినది. అటులనే పందులు మొదలగు జీవులకంటె కుక్కశరీరముకూడ కోమలమయినది. నీశరీరమునందు ఇంద్రాణి, అప్సరసలు ప్రేమను చూపునట్లుగనే కుక్కశరీరముపై ఆడుకుక్కలుకూడ ప్రేమను చూపును. నీకు అపకారము చేసినవానియందు నీవు క్రోధమును ప్రకటించునట్లుగనే కుక్క తన అపకారియందు కూడ క్రోధమును ప్రకటించును. ఇటు మీఇద్దరకును సమానత్వము కలదు.”

స్వా. ప్ర. :—మహమ్మదీయమహాత్ముల చరిత్రమునందు ఒకచోట ఒక మహాపురుషుడు ఇట్లు వ్రాసెను. “నేను స్వప్నమునందు

మానవులందరు గాడిదలతో గడ్డితినుచుండుట చూచితిని." ఇది విని ఒకాయన ఆతనిని ప్రశ్నించెను. "మహాత్మా! అందరు మనుష్యులు గాడిదలతో కూర్చుని గడ్డితినుచుండగా చూచినప్పుడు తమరు ఏమి చేయుచుండిరి?" మహాపురుషుడు ఇట్లనెను. "నేనుకూడ వారితో నుంటిని. కాని భేదము కొంచెము కలదు. అందరు గడ్డితినుచు ఆనందించుచుండిరి. (భోగములను అనుభవించుచుండిరి.) కాని నేను మాత్రము ఒకచోట ఆలోచించుచు కూర్చొనియుంటిని."

యోగవాశిష్ఠమునకూడ చెప్పబడినది.

*జ్ఞాత్వా ప్రత్యన్త వైరస్యం యః పదార్థేషు మూఢధీః ।*
*బధ్నాతి భావనాం భూయో నరో సాసౌ న గర్దభః ॥*

"మూఢుడు వస్తువులు సారములేనివి అని తెలిసియుండికూడ పదార్థముల మోహమున బద్ధుడగును. అట్టివాడు గాడిద."

ఇట్లు శాస్త్రకారులు మానవుని కుక్కతోడను, గాడిదతోడను పోల్చినను నాకు సిగ్గు కలుగదు.

ఇది విని శ్రీనిత్యానందస్వామివారు ఆనందాశ్రువులనుకార్చిరి.

## తమోగుణ లక్షణము.

*లోభః స్వప్నోఽధృతిః క్రౌర్యం నాస్తిక్యం భిన్నవృత్తితా ।*
*యాచిష్ణుతా ప్రమాదశ్చ తామసం గుణలక్షణమ్ ॥*

"లోభము, స్వప్నము, నిలకడలేకపోవుట, క్రౌర్యము, నాస్తికత్వము, భ్రష్టాచారము, యాచనాస్వభావము, పొరపాట్లుచేయుట ఇవి అన్నియు తమోగుణలక్షణములు."

### లోభః.

లభించిన వస్తువును దాచుకొనుట లోభము. తనదగ్గరనున్న ధనమును ఇతరులకు ఇవ్వకుండుట, ఎందుకును ఉపయోగించకుండుట, కేవలము రక్షించుట.

ఒక గృహస్థునివద్ద ధనము, బంగారము, వెండి చాలఉండెను. ఆతడు దానిని ఒకగోతిలో భద్రపరచెను. అతనికి వాటిని ఉపయోగించుటకాని, ఇతరులను ఉపయోగించనిచ్చుటకాని ఇష్టము లేదు. రోజు ఆప్రదేశమున మంచము వేసికొని పరుండెడివాడు. అర్ధరాత్రి గొయ్యి త్రవ్వి ధనమును లెక్కచూచుకొని సంతోషించెడి వాడు. ఇట్లు ప్రతిదినమును ఆతడు చేసెడివాడు. ఒకరాత్రి ఒకదొంగ ఆతని ఇంటికి వచ్చెను. అర్ధరాత్రిసమయమున ఆగృహస్థుడు గోతి నుండి ధనమును బైటకు తీయుట, లెక్కపెట్టి ఆనందించుట, మరల దానిని పూడ్చివేయుట అన్నియు ఆదొంగ గమనించెను. మరునాడు పగటిపూట ఆదొంగ ప్రవేశించి ధనమును తీసికొనిపోయెను. రాత్రి నియమానుసారము గృహస్థుడు తన నిధిని వెదకి దొంగిలింపబడినట్లు తెలిసికొనెను. ఆతనికి మిక్కిలి శోకము కలిగెను. "అయ్యో! ఈధనము నేను ఖర్చుపెట్టనైనను లేదు, ఇతరులకు ఇవ్వనైనలేదుకదా!" అని విచారించసాగెను. జనులు ఇట్లు ఓదార్చిరి.

"అయ్యా! ఎందుకు ఏడ్చుచున్నావు? ఆధనము నీది కాదు. నీవు అనుభవించనివస్తువు నీది ఎట్లు అగును? అది ఇతరునిది. ఎవనిది ఆ అదృష్టమో ఆతడు తీసికొనిపోయెను. గొయ్యి ఖాళీ అయిపోయిన దని విచారించుచున్నావా? గోతిలో రాయి ఉన్నను, ధనము ఉన్నను రెండును నీకు సమానమే! ఏలనన నీకు ఉపయోగించని ధనము రాతి కంటె హీనమైనది. అందుచే రాళ్ళతో గోతినినింపి సంతోషించుము.

ఈవిషయమున తుకారాము వాక్యములు గమనించదగినవి:—

"ఒకమారు ఒకమహాశయునికి గడ్డము, మీసములు, తల గొరిగించుకొనవలసివచ్చెను. ఆతడు క్షౌరమునకు మంగలిని పిలిపించెను. మంగలి చెప్పెను. "నేను ఒకకానికి ఒకమనుష్యునకు గొరిగెదను," ఆతడు మంగలితో చాలసేపు భేరమాడి డబ్బుకు రెండు

బుఱ్ఱలు చొప్పున నిర్ణయించి గొరిగించుకొనెను. కాని ఆతనివద్ద చిల్లర లేదు. ఒక కాని పూర్తిగా ఎట్లు ఇచ్చివేయగలడు? కావున తన భార్యను పిలచి "అనవసరముగా అరకాని పోవుచున్నది. నీవు నీబుఱ్ఱ గొరిగించుకొనుటలో తప్పు ఏమి ఉన్నది?" అని చెప్పెను. ఆమెబుఱ్ఱ గొరిగించినను తప్పు లేదన్నమాట. కాని డబ్బుమాత్రము వ్యర్థము కారాదు.

ఈ కారణముననే భగవానుడు గీతలో లోభమును నరకద్వార ముగా నిర్ణయించి త్యాజ్యమని పలికెను. మన ఉదరపోషణము చేసి కొనుటయే ధనోపయోగము కాదు. ప్రతిప్రాణికిని ఉపకారము చేయు టకును, వివిధపుణ్యకార్యములయందు ధనమును ఉపయోగించుట యును ధనముయొక్క ప్రధానలక్ష్యము. లోభి తనకొరకుకూడ ధన మును ఉపయోగించడు. ధనమును పరోపకారమునకు వెచ్చించక తన కొరకుమాత్రమే ఖర్చుపెట్టువాడు ఉదారుడనియును చెప్పబడడు. లోభి అనియును చెప్పబడడు. ఆతడు స్వార్థపరుడు. అతడు లోభితో సమానుడు.

స్వప్నః.

నిద్రించుమానవుడు జాగ్రదవస్థకును, నిద్రావస్థకును మధ్య ననుభవించు అవస్థకు 'స్వప్నావస్థ' అని లోకప్రసిద్ధము. అందు తన మనస్సునందే ఏనుగు మొదలగునవి కన్పించును. ఈస్వప్నావస్థకు ఆది నిద్రావస్థ. తమోగుణము కలవాని లక్షణము నిద్రాళుత్వము. మనువు స్వప్నశబ్దముద్వారా ఈ అర్థమునే అపేక్షించెను. సాత్త్వికాది గుణములు కలవారికికూడ నిద్ర వచ్చును. కాని వారు మేల్కొని యున్నప్పుడు తమోగుణవిశిష్టులుగా నుండరు. తగని సమయమున నిద్రించుచున్నను, పగలుఎక్కువసేపు నిద్రించుచున్నను తమోగుణ పరిణామముగానే గ్రహించవలెను. వీనికొరకే ఇచ్చట స్వప్నశబ్దము ఉపయోగించబడినది.

"అభావప్రత్యయాలమ్బనా వృత్తిర్నిద్రా" "అభావప్రత్యయము నకు ఆలంబనమగు వృత్తి నిద్ర." ఈ నిద్రాలక్షణము సూత్రప్రాయముగా తమోవృత్తి ప్రకాశకము. అయినను నిద్రనుంచి మేల్కాంచిన మానవుడు "నేను సుఖముగా నిద్రించితిని" అని తలచుకొనుటచే సత్త్వగుణజన్యమగుటచే సాత్త్వికనిద్ర అనబడును. అటులనే నిద్రనుంచి లేచి "ఎంతయో బాధతో నిద్రించితిని, మనస్సు స్థిరముగా లేదు, సరిగా తోచుట లేదు" అను భావము కలిగించు నిద్ర రజోగుణజన్యమగు నిద్ర అగుటచే రాజసనిద్ర అనబడును. లేచునప్పటికి గ్లాని, జాడ్యము కలిగినచో ఆనిద్ర తామసకృతము. అది తామసనిద్ర అనబడును ఇట్లు సహకారియగు గుణమాత్రముచే సాత్త్వికనిద్ర తామసనిద్రగా చెప్పబడును. నలుగురితోను మాట్లాడునప్పుడును, కథాకాలక్షేపములు వినుచున్నప్పుడును కునికిపాట్లు పడినచో అది తమోగుణలక్షణమే.

## అధృతిః.

మానవుడు ఆచరించు ప్రతికార్యమునందును దార్ఢ్యమును కలుగజేయు ప్రయత్నవిశేషము ధృతి, అనగా పట్టుదల. మనస్సును, ఇంద్రియచేష్టలను అశాస్త్రీయప్రవృత్తినుండి నివారించునది సాత్త్వికమగు ధృతి. ఈ సాత్త్వికమగు పట్టుదల కలిగియుండుటచేతనే హరిశ్చంద్రమహారాజు అనేకఆపదలు కలిగినను స్వధర్మమును త్యజించ లేదు. కర్తృత్వాది అభిమానముతో ధర్మ, అర్థ, కామములయందు మాత్రము కర్తవ్యమును నిశ్చయించునదియును, మోక్షమును కర్తవ్యముగా భావించనిదియును అగునది రాజసమగు పట్టుదల. ఈరెండు రకములగు పట్టుదలయును లేకపోవుట అనగా నాలుగు పురుషార్థములను నిశ్చయించవలెనని తలచకపోవుట. ఆపట్టుదల లేకపోవుటయే "అధృతి" అని శ్లోకమునందలి శబ్దమునకు అర్థము. దానిచే భయము,

శోకము, మదము మొదలగువానికి నరుడు దూరముగా నుండడు. అట్టిస్వభావమును తామసధృతి అని కూడ చెప్పవచ్చును.

## క్రౌర్యమ్

తమోగుణము వృద్ధిపొందినకొలదియును, కృత్యాకృత్యవిభాగమును మరచి క్రోధ, ద్వేషాదికములు ప్రజ్వలించి మానవుడు ఎల్ల వేళలయందును విరుద్ధకార్యములయందు ప్రవర్తించును. ఇట్టి ప్రాణులనే శాస్త్రములు రాక్షస, పిశాచాదిశబ్దములచే వర్ణించినవి. ఇట్టివారు సతతము ఇతర ప్రాణులను హింసించియే సంతుష్టిని పొందెదరు. తొర్రలో నిప్పు ఉండగా చెట్టు పచ్చగనుండుటకు వీలు ఉండనట్లుగనే ఇతరులకు అపకారము చేయనుద్దేశించు హృదయములలో దయకు స్థానము లేదు.

క్రౌర్యమునకు గుజరాతుచరిత్రమునుండి మహారాజగు సిద్ధరాజ జయసింహుని దృష్టాంతము గమనించదగును:-

జయసింహుడు ఒకపరాయి సోమనాథమహాదేవుని దర్శనార్థము యాత్రకు వెడలెను. ఆతడు మార్గమధ్యమున సౌరాష్ట్రమున మజేవడిగ్రామమున ప్రారబ్ధవశమున 'హడమత' అను కుంభకారుని ఇంట పెరిగిన రూపవతియగు శేర్ పావనుని కుమారి రాణకదేవిని చూచెను. ఆమెను వివాహమాడవలెనని జయసింహునకు కోర్కె కలిగి కుంభకారునికి తన ఇచ్ఛను వెల్లడించెను. గుజరాతునకు మహారాజును శ్రేష్ఠపురుషుడగు జయసింహుడంతటివాడు తనకు అల్లుడగుచున్నాడను ఆనందముతో సిద్ధరాజ జయసింహుని కోర్కెను అంగీకరించి కుంభకారుడు రాణకదేవి వివాహమును నిశ్చయముచేసెను.

ఈవార్త 'జూనాగఢ్' రాయ ఖేంగారునకు తెలిసెను. సౌరాష్ట్రసుందరియగు కుమారిని గుజరాతురాజు సిద్ధరాజు వరించుట తనకు అగౌరవముగా తోచెను. ఈఅభిప్రాయముతో కుంభకారుని

ఒప్పించి, తన బలపరాక్రమములపైనను, వ్యక్తిత్వముపైనను ఆసక్తురాలగు రాణకదేవిని పరిణయమాడి రాయఖేంగారుడు జూనాగఢమునకు తీసికొనిపోయెను.

అంతట సిద్ధరాజు తనసైన్యమును తీసికొని జూనాగఢ్‌పై దండయాత్ర వెడలెను. అతనిని రాయఖేంగారుడు పన్నెండు సంవత్సరములు ధైర్యముతో కోటకు వెలుపల ఆపివేసెను. కాని చివరకు రాయఖేంగారుని మేనల్లుళ్ళగు దేశలుడును, విశలుడును సింహాసనమునందలి లోభముచే సిద్ధరాజుపక్షమున చేరిరి. వారు శత్రువులకు కోటయొక్క గుప్తమార్గమును తెలిపి ఖేంగారుని చంపించిరి.

సిద్ధరాజు క్రోధావేశమున సింహద్వారముకడ కాపలా ఉన్న వృద్ధద్వారపాలుని సంహరించి లోనికి ప్రవేశించెను. మొదట దుష్టుడగు సిద్ధరాజు రాణకదేవిని కాంచి ఆమె తేజమునకు హడలిపోయెను. కాని వెంటనే ఆ తేజమును లక్ష్యము చేయక ఆమెను చేజిక్కించుకొనుటకు ముందుకు నడచెను. అంతియే కాదు. ముక్కుపచ్చలారని ఆమె బాలుర నిరువురలోను ఒకనిని ఖడ్గముతో రెండుముక్కలు చేసెను. మరియొకనిని క్రోధావేశమున కాలితోనలిపివేసి ప్రాణములుతీసెను. ఈరాక్షసకృత్యముచే మూర్ఛిల్లినపతివ్రత యగురాణకదేవిని గుర్రముపై నిడుకొని తన రాజధానియగు పాటణ్ వైపునకు దారితీసెను.

రాణకదేవికి స్పృహవచ్చినవెంటనే ఆమె రాయఖేంగారుని కొరకు విలపించుట సిద్ధరాజు గమనించెను. అంతట జయసింహుడు ఆమె తనకు లోనుకాదని తెలిసికొని శపించుననుభయముతో 'బఢవాణుపట్టణముదగ్గర ఆమెను విడచి వెళ్ళిపోయెను. రాణకదేవి బఢవాణునందు నదీతీరమున అగ్నియందు ప్రవేశించెను. నేటికిని ఆమె సమాధి అక్కడ కలదు.

ఇట్లు క్రోధావేశమున సిద్ధరాజు చూపించిన క్రౌర్యమునకు అంతు లేదు.

## నాస్తిక్యమ్.

అనాదిసిద్ధసంసారః కర్తృకర్మవివర్జితః ।
స్వయం ప్రాదుర్భవత్యేవ స్వయమేవ విలీయతే ॥

"ఈప్రపంచము అనాదిసిద్ధము. అనగా అనాదినుండియు ఇటులనే ఉన్నది. దీనిని రచించినవాడు లేడు. రచన జరుగలేదు. అనగా ఈజగత్తును సృష్టించిన సృష్టికర్తయగు భగవానుడు ఎవ్వడును లేడు. ఇది స్వయముగా ఉద్భవించినది. ఇది స్వయముగా లయమును పొందును." అని నాస్తికులు తలచెదరు.

కాని నైయాయికులుమాత్రము జగత్కర్త ఈశ్వరుడని అంగీకరించెదరు. "క్షిత్యఙ్కురాదికం కర్తృజన్యం, కార్యత్వాత్, ఘటవత్." ఘటాదులు కుంభకారునిచే చేయబడినవి. అటులనే భూమ్యాదులు కూడ ఒక కర్తచేతనే సృజించబడినవి. కాని ఆకర్త సామాన్యమానవుడు కాడు. సర్వజ్ఞుడును, సర్వశక్తివిశిష్టుడును అగు ఆదైవమే జగత్తునకు కర్త 'అని నైయాయికులు తలచెదరు. జగత్కర్త ఈశ్వరుడు. జగత్తును సృష్టించుట అనెడు కార్యము ఆయన చేయుకర్మ. ఈసిద్ధాంతమునకు విరుద్ధముగా చార్వాకులగు నాస్తికులు జగత్తును సృష్టించు కర్త ఎవడును లేడు, అతడు చేయు కర్మ ఏదియును లేదు అని చెప్పుదురు. జగత్తు స్వభావసిద్ధము. ఉత్పత్తియును లయమును స్వాభావికముగా జరిగిపోవును. బీజమునుండి అంకురమును, అంకురమునుండి బీజమును ఉద్భవించినట్లుగనే సర్వమును స్వాభావికముగా జరుగును. స్వభావముచే ఉత్పత్తిలయములు జరుగును; వానిని చేయు కర్త ఎవడును లేడు అని వారివాదము. అంతియే కాదు,

న స్వర్గో నాపవర్గో వా నైవాత్మా పారలౌకికః ।
నైవ వర్ణాశ్రమాదీనాం క్రియాశ్చ ఫలదాయికాః ॥

"స్వర్గము లేదు, మోక్షము లేదు, పరలోకమునకు ఆత్మ వెళ్ళదు, వర్ణాశ్రమధర్మములను పాలించుటచే ఫలము లేదు- ఈవిధముగా నాస్తికులు తలచెదరు.

ఈ జగత్తును స్వభావసిద్ధముగా తలచు నాస్తికుల సిద్ధాంతము ననుసరించి అపూర్వసుఖము కలుగును. కాని స్వర్గము లేదు. మోక్షము లేదు. వానికొరకు యమ, నియమాదులను పాటించుట యును, గురువులనుండి శ్రవణ, మనన, నిదిధ్యాసనములను నేర్చుకొ నుటయును అక్కరలేదు. పారలౌకికసుఖము లేదు. పునర్జన్మము లేదు. కనుక వేదవిహితములగు కర్మలను ఆచరించవలసిన అవసరము మాత్రము ఏది? వర్ణాశ్రమధర్మములను పాటించుటచే పరలోకము నందు అపూర్వసుఖము కలుగదు. ఏలనన, ధర్మఫలము జన్మాంతరము నందే, అనగా పరలోకమునందే లభించును. అందులకే వర్ణాశ్రమ ధర్మములను అనుష్ఠించుట. ఆపరలోకమే లేనప్పుడు, జన్మాంతరమే లేనప్పుడు ధర్మము ననుష్ఠించుట మట్టిలో 'నేయి'పోయుట మాత్రమే.

అగ్నిహోత్రం త్రయో వేదాస్త్రిదణ్డం భస్మగుణ్ఠనమ్ ।
ప్రజ్ఞాపౌరుషహీనానాం జీవికేతి బృహస్పతిః ॥

"అగ్నిహోత్రము, మూడు వేదములు, త్రిదండము, భస్మధా రణ ఇవి అన్నియు బుద్ధిహీనులకు- అనగా సంపాదించుశక్తి లేనివార లకు రోజుగడుపుకొనుటకు సంపాదనామార్గములు- అని చార్వాక మతకారుడు బృహస్పతి చెప్పెను."

తాను ఆస్తికుడను అను గర్వముకల వైదికుడు మూఢుడు అయి నచో తన రోజుగడుపుకొను శక్తి లేక, తనపొట్ట నింపుకొనుటకు అగ్నిహోత్రమునందు ధర్మభ్రాంతిని కలుగజేసి, ఆధర్మసహాయమున తన

కడుపు నింపుకొనును. అగ్నిహోత్రాదికర్మలనుగూర్చి వేదము ఇట్లు ఆజ్ఞాపించుచున్నది :- "యావజ్జీవేత్ తావదగ్నిహోత్రం జుహుయాత్" బ్రతికియున్నంతకాలము అగ్నిహోత్రమును ఆచరించవలెను. ఇట్టి అగ్నిహోత్రానుష్ఠానముచే, తనను ధర్మనిష్ఠునిగా ప్రజలచే ఘోషింపజేసికొని, ప్రజలమన్ననలను పొంది, ధనాదులను సంపాదించువాడు ఇంద్రియలోలుడు. ఆ అగ్నిహోత్రానుష్ఠాత తన్ను తాను రక్షించుకొనలేడు. ఏలనన అగ్నిహోత్రజన్యమగు అపూర్వముద్వారా స్వర్గాదిఫలములు లభించనప్పుడు అగ్నిహోత్రము వలన ప్రయోజనము లేదు.

అటులనే ఋగ్యజుస్సామవేదములను తనజీవితనిర్వహణోపాయములుగా తలచువాడు-అనగా వానిమహిమను ఆధారముగా తీసికొని రోజులు గడుపుకొనువాడుకూడ అట్టివాడే. ఆ ఉద్దేశ్యముతో వేదములను చదివినను, స్వాధ్యాయముచెప్పినను, చెప్పించినను, ఉపన్యసించినను సమానమే. అటులనే ఏకదండులును, త్రిదండులును అగు సన్యాసులును కడుపునింపుకొనుటకు యతిరూపమున సంచరించెదరు. ప్రజలనుండి పూజలను బడసెదరు. యతులకు నియమింపబడిన సంయమాదులచే లభించు ఫలము జన్మజన్మాంతరములయందు అనుభవించవలసియున్నది. అట్లు కానిచో సన్యసించుటవలన ప్రయోజనము లేదు. కేవలము పొట్టనింపుకొనుటకుమాత్రమే జనులు సన్యాసాశ్రమమును స్వీకరించుచున్నారు. అటులనే మరికొందరు భస్మాదులు ధరించి తమవంటి మహాత్ములు లేరని రుజువుచేయదలచెదరు. మరికొందరు పంచాగ్నితాపమును సహించెదరు. ఇవి అన్నియు ప్రతిష్ఠ కొరకు మాత్రమే.

ఈ భస్మాదులచే వారు ఏ పారలౌకికఫలమును అపేక్షించరు. ఇవి అన్నియు ఐహికజీవితమును గడపుకొనుటకుమాత్రమే. ఏలనన

వేదములను ప్రజ్ఞాహీనులగు మనుష్యులే నమ్మెదరు అని నాస్తికుల అభిప్రాయము.

ఈసిద్ధాంతమును అంగీకరించు నాస్తికులు ఈమాటలను ఆక్షేపణకుమాత్రమే చెప్పిరి. కాని ఇవి అన్నియు ఇప్పుడు ప్రత్యక్షముగా కన్పించుచున్నవి. నేటి ఆస్తికుల మాటలు, వేదములు పరమాస్తికత్వమును సూచించును. కాని ఆంతరికనిశ్చయమునందును, బాహ్యక్రియలయందును చార్వాకులగు నాస్తికుల సిద్ధాంతములనుకూడ ఉల్లంఘించెదరు. ఈరోజులలో పుణ్యక్షేత్రములయందును, మందిరములయందును, ఆశ్రమాదులయందును కార్యరూపమున అన్నిచోట్లను కన్పించెదరు. ప్రతిచోట గురువులును, ఆచార్యులును, సన్యాసులును అనబడుచు జనులకు దైవము నిజము, మిగిలినదంతయు అసత్యము, ప్రపంచమునందలి పదార్థములు అన్నియు మాయ అని ఈవిధములగు వైరాగ్యోపదేశములను చేయుదురు. కాని వారి ఆచరణలో ఆవైరాగ్యము మచ్చునకు కూడ కానరాదు. వారికి మంచిమంచి భవనములు కావలెను. రుచికల ఆహారము కావలెను. అందమగు వస్త్రాలంకారములు వారు ధరించదలచెదరు. చాలధనమును సంపాదించదలచెదరు. ఇట్లు అతిప్రవృత్తియందు వీరు ఉండెదరు. వీరందరును నాస్తికులే.

ఈవిషయమున ఒక మహమ్మదీయమహాత్ముడు ఇట్లు చెప్పెను:—

వైరాగ్యమును పొందకుండ జ్ఞానమునకు సంబంధించిన విషయములను చర్చించువాడు అందరికంటెను గొప్పనాస్తికుడు, పాషండుడు.

## భిన్నవృత్తితా.

సదాచారమునుండి భ్రష్టుడయి దురాచారుడగుటకూడ తమోగుణముకలవాని లక్షణము;

దురాచారో హి పురుషో లోకే భవతి నిన్దితః।
దుఃఖభాగీ చ సతతం వ్యాధితోఽల్పాయురేవ చ॥ (మనుస్మృతి)

"దురాచారము చేయువాడు లోకమున నిందాపాత్రుడగును. ఎప్పుడును దుఃఖములను పొందును. రోగములతో బాధపడును. అల్పాయువును పొందును."

దొంగతనము, జారత్వము, మద్యపానము మొదలగు శాస్త్ర విరుద్ధములును, నింద్యములును అగునవి దురాచారములు. వైదిక ఆచారముచే సర్వమానవధర్మము రక్షించబడును. భ్రష్టాచారముచే ధర్మభ్రష్టత్వము సంభవించును.

అనభ్యాసేన వేదానాం ఆచారస్య చ వర్జనాత్।
ఆలస్యాదన్నదోషాచ్చ మృత్యుర్విప్రాఞ్జిఘాంసతి॥ (మను)

"వేదాభ్యాసముచేయక, ఆచారభ్రష్టుడయి, సోమరితనముతోను - అనగా కర్తవ్యమును నిర్వహించుటలో ఉత్సాహమును ప్రకటించని, తినరాని పదార్థములను భుజించు విప్రుని మృత్యువు త్వరలో సంహరించును."

## యాచిష్ణుతా.

ముష్టెత్తు గుణము. తాను అడుగుట, ఇతరుల ద్వారా తనకొరకు అడిగించుట ఇది అంతయును, ముష్టెత్తుగుణమే.

మరణాత్ప్రార్థనాదుఃఖమధికం హి వివేకినః।
క్షణికం మరణాద్దుఃఖమనన్తం ప్రార్థనాకృతమ్॥

"బుద్ధిమంతునకు, అనగా వివేకము కలవానికి "అడుగుట" చావుకంటె ఎక్కువదుఃఖము కలిగించును. మృత్యువుచే కలుగు దుఃఖము క్షణికము. కాని "అడుగుట"చే కలుగు దుఃఖము అంతములేనిది."

కబీరుదాసు చెప్పినది గమనించుడు:—

మాంగన మరణ సమాన హై మత కోయీ మాంగో భీఖ్;
మాంగనేసే మరనా భలా ఏ హి గురుకా సీఖ్.

అంతియే కాదు. అడిగికొను మనుష్యుని చూచి ప్రపంచము కూడ భయపడును. ఒక విద్వాంసుడు వినోదార్థము ఎట్లు చెప్పెనో వినుము:—

తృణాదపి లఘుస్తూలస్తూలాదపి చ యాచకః ।
వాయునా కిం న నీతోఽసౌ మామయం ప్రార్థయేదితి॥

"గడ్డిపరకకంటె దూది తేలిక. దూదికంటె యాచకుడు తేలిక. వీనిని వాయువు ఏల ఎగరవేసికొనిపోవుటలేదు? తనను యాచించునేమో అని." వాయువుకుకూడ యాచకుని తీసికొనిపోయినచో తనను అడుగునేమో అను భయము వేయుచున్నదేమో! తనదగ్గర అతనికి ఇచ్చుటకు ఏమియు లేనందున అడుగునేమో అను భయము చేతనే వాయువు ఆముష్టివానిని సమీపించుటలేదు.

తనకొరకు యాచించుట నింద్యమే. కాని పరోపకారమునకు కాని, ధర్మకార్యములకొరకుకాని యాచించినచో తప్పు ఏమి కలదు? అను ప్రశ్నకు సమాధానము శాస్త్రవేత్తలు ఇట్లు చెప్పిరి:—

స్వార్థం ధనాని ధనికాత్ప్రతిగృహ్ణతో యద్
ఆస్యం భజేత్ మలినతాం కిమిదం విచిత్రమ్ ।
గృహ్ణన్ పరార్థమపి వారినిధేః పయోఽపి
మేఘోఽయమేతి సకలోఽపి చ కాలిమానమ్॥

"ధనికుని దగ్గరనుంచి తన స్వార్థమునకు ధనమును గ్రహించిన వానికి ముఖము మలిన మగుటలో ఆశ్చర్యమేమి? పరులకొరకు సముద్రోదకమును గ్రహించు మేఘుడుకూడ నల్లబడుచునే యున్నాడే!"

నేడు అనేకప్రదేశములయందు పరోపకారమునకు ధర్మకార్యములు చేయుచున్నామనియు; పాఠశాలలు, అనాధాలయములు, వైద్యశాలలు, సత్రములు కట్టించుచున్నామనియు చందాలు అడిగెరు. ఈచందాలు అడుగువారు ఇతరులవద్ద ధనము ఉన్నదా, లేదా

అను ఆలోచన చేయరు. ఇట్లు ప్రజలను బాధపెట్టి ధనమును సంపాదించుట అధర్మము. ఇట్లు అడుగువారిని జనులు తిరస్కారముతో కూడిన దృష్టితో చూచెదరు. ఆ తిరస్కార దృష్టులతో అడుగువారి ముఖతేజము అంతరించును.

### ప్రమాదః.

చేయవలసిన పనిని చేయవలసిన సమయమున చేయకపోవుట ప్రమాదము. శంకరాచార్యుల వాక్యములు వినుడు :-

న ప్రమాదాదనర్థోఽన్యో జ్ఞానినః స్వస్వరూపతః ।
తతో మోహః తతోఽహంధీః తతో బన్ధః తతో వ్యథా ॥

"జ్ఞానికి పొరబాటుకంటె ఎక్కువకీడు మరియొకటి లేదు. పొరబాటుచే జ్ఞానికి మోహము కలుగును. మోహముచే అహంభావము కలుగును. అహంభావముచే బంధమునందు చిక్కుపడును. అంతట దుఃఖము కలుగును." జ్ఞాని అను శబ్దము ఇక్కడ దృఢముకాని అపరోక్షజ్ఞానముకలవాడు అను అర్థమున ఉపయోగింపబడినది.

ఇప్పుడు అనేకమంది వేదాంతశాస్త్రమును అధ్యయనముచేయుచున్నారు. మననము ద్వారా నేను స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు భిన్నమగు కూటస్థుడగు ఆత్మను అనికూడ నిశ్చయించెదరు. కాని సాంసారిక కార్యములయందు ప్రవృత్తియును, సోమరితనమును కల శరీరమునందు అపరోక్షజ్ఞానమునకు కావలసిన నిదిధ్యాసనము జరుగదు. ఈవిధముగా నిదిధ్యాసనమునందు ప్రమాదముచే అనగా అజాగరూకతచే స్వస్వరూపసాక్షాత్కారము కలుగదు. దేహేంద్రియాదులయందు అహంబుద్ధి వృద్ధిపొందిపోవును. అహంబుద్ధి భోగవిలాసములయందు పెరిగినకొలదియు అసురస్వభావమును చెందును. అంతట జన్మమరణరూపమగు సంసారదుఃఖములు కలుగును.

మహాభారతమున సనత్సుజాతప్రకరణమునుకూడ చూడుడు:-

ప్రమాదో మృత్యురేవాహ భగవాన్ బాదరాయణః।
తస్మాత్ తద్ధ్వంసనే దక్షో యః స మృత్యుంజయో భవేత్॥

"వ్యాసభగవానుడు ప్రమాదము అనగా మృత్యువు అని చెప్పెను. కావున ప్రమాదమును జయించినవాడు అనగా జాగరూకతతో జీవితము గడుపువాడు మృత్యువును జయించును."

పరమశివుడుకూడ మొదట మృత్యువునకు లోబడినవాడేనట. గంగాతీరమున ఏకాంతమున కూర్చుని యోగాభ్యాసము చేయుటచే ఆయన మృత్యువును జయించి మృత్యుంజయుడని చెప్పబడెను. అటులనే మీరుకూడ ప్రమాదముజయించి,ఏకాంతమున కూర్చొని యోగాభ్యాసము చేసినచో మృత్యువును జయించగలరు. మృత్యుంజయులని చెప్పబడుదురు.

ఇంతవరకు తమోగుణలక్షణములు వివరించబడినవి. ఈసమయమున జయంతీభాయి ప్రశ్నించెను :—

"వృత్తిని సాత్త్వికప్రధానముగా చేయుటకు సాధనమేమి?"

స్వా. ప్ర. :—ఈవిషయమున భాగవతము ఇట్లు చెప్పుచున్నది.

శ్రుత్యా సత్త్వపురాణానాం సేవయా సత్త్వవస్తునః।
అనువృత్త్యా చ సాధూనాం సత్త్వవృత్తిః ప్రజాయతే॥

"సాత్త్వికధర్మమును బోధించు గ్రంథములను శ్రవణము చేయుటచేతను, సాత్త్వికపదార్థములను సేవించుటచేతను, సత్సంగముచేతను సత్త్వవృత్తి ఉదయించును.

శ్రుత్యా సత్త్వపురాణానామ్:— సాత్త్వికాది గ్రంథములను గురించి దేవీభాగవతమున వివరించబడినది:—

సాత్త్వికం వేదశాస్త్రాది సాహిత్యం చైవ రాజసమ్।
తామసం యుద్ధవార్తా చ పరదోషప్రకాశనమ్॥

"వేదశాస్త్రాదిశ్రవణము సాత్త్వికము. సాహిత్యశ్రవణము రాజసము. యుద్ధవార్తలను, ఇతరులదోషములను వినుట తామసము."

నాలుగు వేదములు, ఉపనిషత్తులు, గీత మొదలగునవి శ్రవణముచేయుట సాత్త్వికశ్రవణము. కావ్యములు, నాటకములు, నవలలు మొదలగు శృంగారప్రధానములగు గ్రంథములు రాజసములు. అందును యుద్ధవర్ణనలు, పరదోషప్రకాశనములును కల గ్రంథములు తామసములు.

రామాయణ మహాభారతములయందలి యుద్ధభాగములను విడనాడి నీతిభాగములను చదువవలెను. రామచంద్రుడు కైకేయి అడిగిన వరములను అనుసరించే తండ్రిఆజ్ఞను పాలించుటకు రాజ్యము త్యజించి వనవాసము చేసిన నీతిప్రసంగము రామాయణమునుండి చదువవలెను. శాంతి పర్వాదులయందు భీష్మపితామహుడు యుధిష్ఠిరునకు రాజనీతిని ఉపదేశించిన ప్రసంగములను మహాభారతమునందు చదివి యుద్ధభాగము విడువుము.

సేవయా సత్త్వవస్తునః :— సాత్త్వికపదార్థమును సేవించుట. అన్నపానములు, వస్త్రాలంకారములు, నివసించుభవనము మొదలగునవి శరీరమును పోషించుటకును, రక్షించుటకును అవసరమయినంత వరకు మాత్రమే గ్రహించవలెను.

అనువృత్త్యా చ సాధూనామ్ :— సత్పురుషులచెంతకువెళ్ళి సన్మార్గమును గ్రహించవలెను.

శ్రీమద్భాగవతమున సత్పురుషుల లక్షణము చెప్పుచు కపిలుడు తనతల్లితో నిట్లనెను.

*తితిక్షవః కారుణికాః సుహృదః సర్వదేహినామ్,*
*అజాతశత్రవః శాన్తాః సాధవః సాధుభూషణాః॥*

మయ్యనన్యేన భావేన భక్తిం కుర్వన్తి యే దృఢామ్,
మత్కృతే త్యక్తకర్మాణః త్యక్తస్వజనబాన్ధవాః॥
మదాశ్రయాః కథా ఇష్టాః శృణ్వన్తి కథయన్తి చ।
తపన్తి త్రివిధాః తాపాః నైతాన్మద్గతచేతసః॥
త ఏతే సాధవః సాధ్వి! సర్వసంగవివర్జితాః।
సంగః తేష్వథ తే ప్రార్థ్యః సంగదోషహరా హి తే॥

"తల్లీ! ద్వంద్వములను సహించినవారును, దయకలవారును, ప్రాణుల యందు నిస్స్వార్థమగు ప్రేమకలవారును, శాంతులును, శత్రువులు లేనివారును, భగవంతునియందు అనన్యభావముతో దృఢమగు భక్తికలవారును, దేవునికొరకు సమస్తకర్మలయందును, స్వజనుల యందును, బంధువులయందును మమత్వమును త్యజించినవారును, నిత్యము దేవునికథలను కీర్తించువారును, శ్రవణముచేయువారును, దైవమునందునిమగ్నులగువారును సాధువులు. వారుత్రివిధతాపములచే బాధను పొందరు. ఈసాధువులకు ఏవిధమైన కోరికలును ఉండవు. వారే కామదోషమును నశింపజేయకలరు. వారి సాంగత్యము చేయవలెను."

ఇతరగ్రంథములయందు కూడ చూడుడు :—

యథా చిత్తం తథా వాచో యథా వాచస్తథా క్రియా।
చిత్తే వాచి క్రియాయాం చ సాధూనామేకరూపతా॥

"మనస్సులో ఎట్లుఉండిన అటులనే మాట ఉండును. మాట ఎట్లు ఉండిన క్రియ అటులనే ఉండును. అనగా సత్పురుషుల మనస్సు, వాక్కు, కర్మ—ఈమూడును ఒకేరకముగ నుండును."

ఈ దృష్టాంతమును వినుడు."

గోరా, కుంభారు, జ్ఞానోభా మొదలగు కొందరు భక్తులు ఒకప్పుడు పండరీపురమున సమావేశమయిరి. భజనలు సాగుచుండెను. అంతట సాక్షాత్తు విఠ్ఠలనాథుడు ప్రత్యక్షమై వారితో నిట్లనెను—

"సోదరులారా! ఈ అందరు నన్ను నమస్కరించుచున్నారు. కాని నేడు నాకు కూడ ఎవరికో ఒకరికి సాష్టాంగనమస్కారము చేయవలెనని ఉన్నది. ఎవరికి నమస్కరింతును? చెప్పుడు." భక్తులు ఇట్లనిరి :- "ఈ ప్రశ్నకు తుకారాంగారు తప్ప మరెవ్వరును సమాధానము ఇయ్యలేరు. విఠ్ఠలనాథుడు తుకారామును అడిగెను. అంతట తుకారాము ఇట్లు సమాధానము చెప్పెను.

"బోలే తస చాలే, త్యాచా వందోన పాఉలేం,"

"మాట్లాడినట్లు సంచరించినవాడు వందనీయుడు."

విఠ్ఠలనాథుడు పలికెను:-"అట్టివారు మీరే. కావున మీకే నేను సాష్టాంగనమస్కారము చేయుచున్నాను."

తాత్పర్యమేమన, మహాపురుషుల మనస్సు, వాక్కు, కర్మ ఒకే రకముగా నుండును.

ఇట్టి గుణములు కల సాధువులు చేయు సదాచారములను అనుసరించవలెను. ఇట్లు చేసినచో సత్త్వగుణము వృద్ధిని పొందును.

**చెప్పుటయు, వినుటయును సులభము,**

**కాని ఆచరించుట కష్టము.**

ఈసంగతులు అన్నియును చెప్పుటయును, వినుటయును సులభము. ఆచరించుటమాత్రము అతికష్టము. మీకు ధర్మమునందు నమ్మకము ఉన్నచో ధనాదిపదార్థములయందు తృష్ణను విడనాడి క్రియయందు తత్పరులు కండు. ఏలనన, ఏపని అయినను చేసినచో సరిగ చేయవలెను. లేనిచో ఈధర్మము మొదలగునవి అన్నియు పుక్కిటి పురాణములని నమ్మి తినుచు, త్రాగుచు తందనాలు త్రొక్కుచు ఉండుట మంచిది.

స్వా. ని:— తమవంటి గురువు దొరికినతరువాత తినుచు, త్రాగుచు, తందనాలు త్రొక్కుచు ఉండుట ఎట్లు?

## బా ల గు రు వు లు.

స్వా. ప్రి.:— ఒక విద్వాంసుడు అగు జ్ఞాని సంచారము చేయుచు దైవవశమున ఒక గ్రామమునకు వచ్చెను. వారి దర్శనమునకు అనేకమంది వచ్చుచుండుట చూచి ఒక గొల్లపిల్లవానికికూడ ఆయన దర్శనము చేయవలెనని తోచెను. వాడు ఆయనచెంతకు వెళ్ళినప్పుడు ఆయన ఒక్కడే ఉండెను. ఆపిల్లవాడు ఆయన కాళ్ళు పట్టుకొని 'బాబూ, నన్ను శిష్యునిగా స్వీకరించుడు' అని పలికెను. ఆమహాత్ముడు ఇట్లనెను:—"శిష్యత్వమువలన ఏమియు సుఖము లేదు. రోజంతయు భిక్షాటనము చేయుట, నీళ్ళు తోడుట, బట్టలు ఉతుకుట మొదలగు పనులు చేయవలసివచ్చును. రోజంతయు శ్రమపడవలసివచ్చును." ఆపిల్లవాడు ఈమాటలు వినికూడ ఆయనకాళ్ళు వదలలేదు. "నన్ను శిష్యునిగా చేయవీలులేనిచో గురువునిగా చేయుడు" అని ఆయనను ప్రార్థించెను.

ఆమహాత్ముడు ఇట్లనెను:—"సరే, నిన్ను గురువునిగా తీసికొంటిని. ఒక కౌపీనముమాత్రము ధరించి ఇక్కడే ఉన్నతాసనమున కూర్చొని ఉండుము. ఎవ్వరితోడను మాట్లాడరాదు." అని చెప్పెను. అతడు అట్లే కూర్చొని ఉండెను. మహాత్ముని దర్శించుటకు జనులు వచ్చిరి. ఆయన వెర్రివాడువలెఉన్న పిల్లవాడిని ఒక ఉన్నతాసనమున కూర్చుండబెట్టి ఉంచుట చూచి ఆశ్చర్యముతో "ఇతడెవ్వ"డని అడిగిరి. మహాత్ముడు "వీరు నాగురువులు" అని సమాధానము చెప్పెను. ఇది వినినంతనే అందరకును సందేహము కలిగెను. వారు ఆలోచనలో పడిరి. అంతలో రాజుగారు ఆచోటికి వచ్చెను. ఆయనకూడ అదే ప్రశ్న అడిగెను. మహాత్ముడు తమ గురువనియే చెప్పెను.

రాజు:—సందేహములకు సమాధానము నేమైన వారుచెప్పెదరా?

మహాత్ముడు:— ఇతగులు చెప్పలేనంత కఠినప్రశ్నలకు మాత్రమే వారు సమాధానము చెప్పెదరు.

అంతట రాజును, మిగిలినవారును ఇంకను ఆలోచనలో పడిపో యిరి. ఇంతలో ఆబాలుని దృష్టి ఎదుటనుండి పోవు గొర్రెలపై పడెను. మామూలు అలవాటుప్రకారము గొర్రెలకాపరివలె "తక్, తక్" అని పలికెను.

రాజు:— ఇదిగో వీరు మాట్లాడుచున్నారే అనెను.

మహా:- గురువుగారు దయాపరులు. సూత్రరూపమున తెలిపిరి.

రాజు:— ఏమి తెలిపిరి?

మహా:— ఈ మానవశరీరము జ్ఞానము సంపాదించుటకు మాత్రమే. కావున ఈ మనుష్యశరీరమే "సదవకాశము"(తక్) అని చెప్పినారు.

ఇంతలో మరల ఆబాలుడు "తర్, తర్" అనెను.

రాజు:— స్వామీ! మరల ఏదియో చెప్పుచున్నారే!

మహా:— ఇప్పుడు రెండవ సూత్రమును తెలిపిరి. ఈసంసార మనెడు సముద్రమున మునిగినవారు "తరించు"డని(తర్)సూచించిరి.

ఇట్లు ఈజయంతీభాయికూడ నాగురువు. ఆయన బ్రహ్మను కూడ లక్ష్యముచేయడు.

## నేటి గురు శిష్యులు.

ఇట్లు శ్రీప్రకాశానందస్వామివారు తమ మామూలుధోరణిలో పైదృష్టాంతమును చెప్పి ఇట్లనిరి:-"పూర్వము రాజులు, శ్రీమంతులు మొదలగు జిజ్ఞాసువులు ప్రతిసంవత్సరము ఆరుమాసములు తమ నిత్యప్రవృత్తినుండి బయటకు వచ్చెడివారు అనగా సంవత్సరములో ఆరుమాసములకాలము ఋషులచెంతను ఉండి వారి ఆజ్ఞానుసారము విషయసుఖములకు దూరముగానుండు వారిజీవితమువంటి సాధుజీవితమును తాము గడిపెడివారు. బ్రహ్మవిద్యను అభ్యసించెడివారు.

ఇప్పుడు మేము శిష్యుల బంగళాలలో ఉండవలెను. వారికి ఇష్టమగు ఆహారము భుజించవలెను. వారితో మోటారులో విహరించ

వలెను. ఇట్లు ఆనందముతో వారు చేసినట్లు మేముకూడ చేసినచో వారు కృతకృత్యుల మనుకొనెదరు. మేము మాశిష్యుల ఆజ్ఞానుసారము ఉండవలెను. ఆవిధముగా నేను వీరి శిష్యుడను. వీరు నాకు గురువులు. ఇంతవరకు నాకు అందరు గురువులే దొరికిరికాని శిష్యులు దొరకలేదు.''

శ్రీనిత్యానందస్వామివారు నవ్వుచు ఇట్లనిరి:—

''ఇది నిజము. మనము వందలకొలది జనులకు శిష్యులమగుట మంచిది కాని ఒకనికి గురువగుట- భారమగుట తప్పు.''

## సత్సంగముచే కలుగు లాభము.

అంతట స్వామిప్రకాశానందులవారు పీఠడియా విడచి వెళ్ళుటకు అనుమతించమని కోరిరి. ఆప్రసంగమున వారు శ్రీనిత్యానందులవారితో ఇట్లనిరి :-

''తమవద్దకు నేను ఎప్పుడు వచ్చినను నాకేదియో ఒక లాభము కలుగుచునే ఉన్నది.

చాణక్యుని వాక్యములు ఆలకించుడు :—

*గమ్యతే యది మృగేన్ద్రమన్దిరం, లభ్యతే కరికపోలమౌక్తికమ్ ।*
*జమ్బుకాలయగతే చ ప్రాప్యతే వత్సపుచ్ఛఖురచర్మఖణ్డనమ్॥*

''సింహపు గుహలోనికి వెళ్ళినచో ఏనుగు గండస్థలమునందలి ముత్యము లభించును. నక్క ఉన్న బొరియలోనికి వెళ్ళినచో దూడలు, మేకలు మొదలగువాని తోకముక్కలు, చర్మపుముక్కలు మొదలగునవి దొరకును.''

నేను తమచెంతకు వచ్చిన ప్రతిమారును ఎంతయో ఆనందము కలుగుచున్నది, ఇచ్చటనుండి వెళ్ళదలచినప్పుడు తమ వియోగము ఎంతయో బాధించుచున్నది.

స్వా. ని. :—ఇది అన్యోన్యాశ్రయము.

—X—